
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
నిర్మల్ జిల్లా వార్తలు
6
శనివారం 13 సెప్టెంబరు 2025



15, 16 తేదీల్లో డిగ్రీ స్పాట్ అడ్మిషన్లు

నిర్మల్‌రూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 15, 16 తేదీల్లో పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్పాట్‌అడ్మిషన్ కలవని దోస్త్ జిల్లా సమన్వయకర్త జి.అర్చన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... అభ్యర్థులు ఒరిజినల్, జిరాక్స్ ఎస్ఎస్‌సీ, ఇంటర్, నాలుగో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు బోనాఫైడ్ సర్టిఫికెట్లు, కులధ్రువ పత్రం, ఆదాయ ధ్రువపత్రం, ఒరిజినల్ టీసీ, ఆధార్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో పాటు దోస్త్ రిజిస్ట్రేషన్ ఫీజు రూ.425 చెల్లించి స్పాట్‌అడ్మిషన్ ప్రక్రియ పూర్తి చేసుకోవాల్సిందిగా తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు అడ్మిషన్ తీసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం.సుధాకర్ తెలిపారు.

గోదావరి పుష్కరాలకు

సీఎం మాస్టర్ ప్లాన్

- శాశ్వత ఘాట్ల నిర్మాణం, సదుపాయాల కల్పన
- తీర ప్రాంతంలోని ఆలయాల అభివృద్ధి
- సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని ఆదేశం



బాసర గోదావరి తీరంలో స్నాన ఘాట్లు

బాసర, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా గోదావరి నది పుష్కరాల కోసం చేపట్టే ఏర్పాట్లపై శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రులు రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పుష్కరాల సన్నద్ధతపై దిశ నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా బాసరతో పాటు కాళేశ్వరం, ధర్మపురి, భద్రతచాలం సహా గోదావరి నది తీరం వెంట ఉన్న ఆలయాలు అన్నింటిని అభివృద్ధి చేసేలా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి సూచించారు. పుష్కరాలు తాత్కలిక వేడుకలకుగా కాకుండా, రాష్ట్ర ఆధ్యాత్మిక వారసత్వాన్ని ప్రతిబింబించే మహోత్సవంగా నిలిచేలా ఏర్పాట్లు ఉండాలని ఆదేశించారు. దీనికి కావలసిన రహదారులు, ఘాట్‌లు, భక్తుల వసతులు, ఆలయాల అభ్వృద్ధి అన్నీ శాశ్వత స్థాయిలో నిర్మించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పారు. దేశం నలుమూలల నుంచి లక్షలాది భక్తులు రానున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని శాఖలతో సమన్వయం చేసుకుంటూ ఒకే మాస్టర్ ప్లాన్ అమలు చేయనుంది. దీంతో గోదావరి పుష్కరాలు కేవలం దార్మిక కార్యక్రమం కాకుండా, రాష్ట్ర గౌరవాన్ని ప్రతిబింబించే ఆధ్యాత్మిక, సాంస్కృతిక ఉత్సవంగా నిలువనున్నాయి.

గోదావరి తీరంలో గల బాసర, కాళేశ్వరం, ధర్మపురతి, భద్రాచలం ఆలయాలను భక్తుల రద్దీకి అనుగుణంగా అభివృద్ధి చేయాలని సమీక్ష సమావేశంలో చర్చ జరిగింది. ఈ దిశగా చర్యలు తీసుకోవాలని పక్కా ప్రణాళిక రూపొందించాలని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ఒక్క గోదావరి పుష్కరాల సమయంలోనే కాకుండా భవిష్యత్తులో టెంపుల్ టూరిజంకి ఉపయోగపడే విధంగా ఏర్పాట్లు జరగాలనేది ప్రభుత్వ ఉద్దేశం. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి అధికారులకు ఈ సూచన చేసినట్లు తెలుస్తోంది. నాలుగు ప్రధాన దేవాలయాలను కలుపుతు ఏర్పడే ఈ కారిడార్ రహదారితో భవిష్యత్తులో ప్రతి గోదావరి పుష్కరాల రోజులలోని కాకుండా, సాధారణ దినాల్లో ఆయా క్షేత్రాలు పర్యాటకంగా అభివృద్ధి చెందనున్నాయి.

12 రోజులకు కాదు.. శాశ్వత ఏర్పాట్లు..

12 సంవత్సరాలకు ఒక సారి వచ్చి ఈ గోదావరి పుష్కరాలు 12 రోజుల పాటు జరుగుతాయి. 2027 జూలై చివరి వారం నుంచి ఆగష్టు మొదటి వారం వరకు జరిగే ఈ సారి గోదావరి పుష్కరాలకు ప్రభుత్వం ఇప్పటి నుంచి ప్రణాళికలు సిద్ధం చేస్తుంది. అయితే ప్రతి సారి గోదావరి పుష్కరాలు అంటే 12 రోజులు మాత్రమే కావడంతో తాత్కలిక ఏర్పాట్లకు పెద్దపీట వేసే వారు. తాగునీరు, మరుగుదొడ్లు, రహదారులు, ఇతర వసతి ఏర్పాట్లు తాత్కలికంగా కల్పించేవారు. ప్రతి సారి ఇదే తంతుగా జరిగేవి. కానీ ఈ సారి మాత్రం సీఎం రేవంత్ రెడ్డి సూచనల మేరకు తాత్కలికంగా కాకుండా భవిష్యత్తు అవసరాలకు యాత్రికులకు ఉపయోగపడే విధంగా వసతి సౌకర్యాలు ఉండాలనేది ప్రభుత్వ ఉద్దేశం అందుకే శాశ్వత ఏర్పాట్ల కోసం ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

ఆధునిక స్నానఘాట్‌ల నిర్మాణం

ఆలయాల అభివృద్ధి ప్రాంగణాల విస్తరణ శుభ్రత, భక్తుల కోసం ప్రత్యేక వసతి, భక్తుల సౌకర్యార్థం తాగునీరు, విద్యుత్తు, వైద్య శిబిరాలు, రవాణా సౌకర్యాలపై సమగ్రంగా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. హైదరాబాద్‌లో జరిగినీ సమీక్ష సమావేశంలో దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ప్రభుత్వ సలహాదారుల వేం నరేంధర్‌రెడ్డి, ముఖ్య అధికారులంతా పాల్గొన్నారు.

హైకోర్టు ఆదేశాలను అమలు చేయాలి

● అడిషనల్ కలెక్టర్‌కు ముదిరాజ్‌ల వినతి



అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ముదిరాజ్ సంఘం నేతలు

నిర్మల్ చైన్‌గేట్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : లక్ష్మణచాంద మండలం పీచర గ్రామంలో గత ఆగస్టులోనే మత్స్యశాఖ సహకార సొసైటీ ఏర్పాటు చేయాలని హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను వెంటనే అమలు చేయాలని కోరుతూ అడిషనల్ కలెక్టర్‌కు ముదిరాజ్‌సంఘం నేతలు వినతిపత్రం సమర్పించారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టర్ కార్యాలయం ఆవరణలో తక్షణమే సొసైటీ ఏర్పాటుతో పాటు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆయనకు సమర్పించారు. ఈ సందర్భంగా మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, అఖిల భారత కోలి సమాజ్ జాతీయ కార్యవర్గ సభ్యులు డాక్టర్ బొజ్జ నారాయణ ముదిరాజ్, తదితరులు మాట్లాడుతూ... మూడు వారాల్లోనే హైకోర్టు ఆదేశాలను అమలు చేయాల్సినప్పటికీ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. ఈ విషయంలో కలెక్టర్‌తో పాటు ఎస్పీ, ఇతర అధికారులు జోక్యం చేసుకొని ముదిరాజ్ సొసైటీ ఏర్పాటుకు స్థానిక మత్స్యకారులు చేస్తున్న ఆందోళనకు మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నిర్మల్ జిల్లా అధ్యక్షుడు బోండ్లగంగాధర్, ఆదిలాబాద్ నాయకులు చిన్నయ్య పాల్గొన్నారు.

చేపపిల్లల పంపిణీపై మళ్లీ ఉత్కంఠ

- దాఖలు కాని టెండర్‌లు
- ముందుకు రాని కాంట్రాక్టర్‌లు
- నాల్గవసారి వాయిదా
- ఆందోళనలో మత్స్యకారులు

నిర్మల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ప్రతియేటా వర్షాకాలం సీజన్‌లో మత్స్యకారులకు ఉపాధి కల్పించేందుకు గానూ ప్రాజెక్టుల్లో, చెరువుల్లో చేపపిల్లల పెంపకాన్ని ప్రభుత్వం చేపడుతోంది. ఇందులో భాగంగానే మత్స్యకారుల కోసం ఉచితంగానే చేపపిల్లలను పంపిణీ చేస్తుంది. రెండు సంవత్సరాల నుంచి చేప పిల్లల పంపిణీతో పాటు వాటిని పంపిణీ చేసిన కాంట్రాక్టర్‌లకు బిల్లులు చెల్లించకపోవడం అలాగే చేపపిల్లలు నాణ్యతగా లేకపోవడం లాంటి ఫిర్యాదుల కారణంగా ఈ సారి చేపపిల్లల టెండర్‌లకు ఆటంకాలు ఎదురయ్యాయి. అయితే ప్రతియేటా మాదిరిగా ఈసారి కూడా మత్యశాఖ టెండర్‌లను పిలిచింది. రెండునెలల నుంచి ఇప్పటి వరకు నాలుగుసార్లు టెండర్‌లను పిలిచిన ఏ ఒక్క కాంట్రాక్టర్ కూడా జిల్లాలో చేపలు పంపిణీ చేసేందుకు టెండర్‌లు దాఖలు చేయలేదు. శుక్రవారం టెండర్‌ల దాఖలుకు మరోసారి చివరి గడువును విధించినప్పటికీ గుత్తేదారులు మాత్రం టెండర్‌లు దాఖలు చేయకపోవడంతో ఈసారి చేపపిల్లల పెంపకంపై ఉత్కంఠ నెలకొంటోంది. జిల్లాలో మొత్తం నాలుగు ప్రాజెక్టులు, 557 చెరువులు ఉండగా ఈ చెరువుల్లో చేపల పెంపకంపై సుమారు 20 వేల కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయి. ఇప్పటికే చేపపిల్లలను జలాశయాల్లో వదిలినట్లయితే అవి పెరిగి ఉండేవని, ఈసారి ఆలస్యం కావడంతో వాటి పెంపకం సకాలంలో సాధ్యంకాకపోవచ్చని మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం బిడ్డర్‌లు ముందుకు రాకపోతుండడంతో ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనని మత్స్యకారులు ఆందోళనలో ఉన్నారు.



చేపలను పడుతున్న మత్స్యకారుడు

20వేల కుటుంబాలపై ప్రభావం...

కాగా జిల్లావ్యాప్తంగా మొత్తం 200లకు పైగా మత్స్యసహకార సంఘాలుండగా ఈ సంఘాల్లో సుమారు 14 వేల మంది సభ్యులు న్నారు. వీరితో పాటు మరో 6 వేల మంది వరకు సంఘాల్లో సభ్యత్వం లేని వారు ఉన్నారు. అయితే ఇప్పటి వరకు ప్రాజెక్టులు, చెరువుల్లో చేప పిల్లలను వదలని కారణంగా ఈ 20వేల మత్స్యకార కుటుంబాలు తమ ఉపాధిపై భరోసాను కోల్పోతున్నాయి. అయితే ప్రభుత్వం దీనికి ఎలాంటి ప్రత్యామ్నాయం చూపుతుందోననే అంశం అంతటా చర్చకు కారణమవుతోంది. అయితే మత్స్యకార సంఘాలు మాత్రం చేప పిల్లల పంపిణీ బాధ్యతలను తమకే అప్పజెప్పాలని కోరుతున్నాయి. చేప పిల్లల పంపిణీకి సంబంధించిన నిధులను ప్రభుత్వం తమ ఖాతాల్లో జమ చేయాలని కోరుతున్నాయి.



చేపలను పడుతున్న దృశ్యం

పాత బకాయిలు చెల్లించిన తర్వాతే కొత్త టెండర్లకు పిలవాలి...

● జింక సూరి, కాంట్రాక్టర్



రెండు సంవత్సరాలకు సంబంధించిన పాత బకాయిలు ప్రభుత్వం వెంటనే చెల్లించాలి. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం కాంట్రాక్టర్లకు కోట్ల రూపాయల బకాయిలు చెల్లించాల్సి ఉంది. పాత బకాయిలు రాకపోవడంతో మేము అప్పుల ఊబిలో కూరుకుపోయాం. పాత బకాయిలు చెల్లించిన తర్వాతనే కొత్త టెండర్లకు పిలవాలి.

జిల్లాకు 4.29 కోట్ల చేపపిల్లల పంపిణీ లక్ష్యం

జిల్లాలో మొత్తం 557 చెరువులు, నాలుగు ప్రాజెక్టులు ఉండగా వీటిలో 4.29 కోట్ల చేపపిల్లలను పంపిణీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే ఇప్పటి వరకు ఒక్క చేపపిల్లను కూడా పంపిణీ చేయకపోవడం గానీ చేప పిల్లలను జలాశయంలో విడుదల చేయకపోవడం గానీ జరగలేదు. గతంలో చేపపిల్లలను పం పిణీ చేసిన వ్యవహారాలపై అనేక ఆరోపణలు రావడం అప్పటి ప్రభుత్వం చేప పిల్లలను పంపిణీ చేసిన గుత్తేదారులకు బిల్లులు చెల్లించకపోవడంతో ఈ ప్రక్రియకు ఆటంకాలు మొదలయ్యాయి. ప్రభుత్వం ఈ సారి ప్రత్యామ్నాయ చర్యలను అన్వేషించినప్పటికీ పరిష్కారం మాత్రం కనిపించకపోవడంతో మళ్లీ కాంట్రాక్టర్‌లకే చేపపిల్లల వ్యవహారాన్ని అప్పజెప్పాలని భావించి దానికి అనుగుణంగా టెండర్‌లను సైతం ఆహ్వానించింది. ఈ క్రమంలో నాలుగుసార్లు టెండర్‌లను పిలిచిన కాంట్రాక్టర్లు జిల్లాకు సంబంధించి ఒక్కరు కూడా బిడ్‌ను దాఖలు చేయలేదు. అయితే చిట్ట చివరకు కూడా బిడ్ దాఖలు కాకపోవడంతో ఇక ప్రభుత్వం చేపపిల్లల పంపిణీపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి.

పనులను గడువులోగా పూర్తి చేయాలి

● జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ రూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, పంచాయతీ రాజ్ శాఖల ఆధ్వర్యంలో జరుగుతున్న పనులను నిర్ణీత గడువులోగా పూర్తిచేయాలని కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ శాఖల పనుల పురోగతిని సమీక్షించిన కలెక్టర్, అంగన్‌వాడీ భవనాలు, పాఠశాలల మరుగుదొడ్లు, ఉపాధిహామీ నిధుల ద్వారా చేపట్టిన పనులపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... అధికారులు స్వయంగా పనులను పర్యవేక్షించి, ప్రజలకు ఉపయోగపడేలా తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. అభివృద్ధి పనులన్నింటినీ సమయానికి పూర్తిచేయడంలో ఎటువంటి అలసత్వం ప్రదర్శించవద్దని స్పష్టం చేశారు. సమావేశంలో డీఆర్డీవో విజయలక్ష్మి, పంచాయతీ రాజ్ ఈఈ చందు నాయక్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

బాసరలో భక్తుల రద్దీ



ప్రధానాలయంలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

బాసర, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): బాసర సరస్వతీ అమ్మవారి ఆలయంలో శుక్రవారం పురస్కరించుకొని భక్తుల సందడి నెలకొంది. గోదావరి నది తీరంలో నదిస్నానాలు ఆచరించి భక్తులు సరస్వతీ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయంలో రెండు మండపాల్లో 80 మంది చిన్నారులకు అక్షరశ్రీకార పూజలు జరిగాయి. సరస్వతీ అమ్మవారికి ఉదయం జరిగిన అభిషేక పూజల్లో అధికంగా భక్తులు పాల్గొన్నాయి.

'ప్రజలు అప్రమత్తంగా ఉండాలి'

ముథోల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున లోతట్టు, ముంపు ప్రాంతాలలో ఉన్న ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకొని అప్రమత్తంగా ఉండాలని ముథోల్ తహసీల్దార్ శ్రీలత ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే చెరువులు, విద్యుత్ ఇనుప స్తంభాలు, జాలీల వద్దకు విద్యుత్ మీటర్ల దగ్గరకు వెళ్లవద్దని, కూలిపోయే స్థితిలో ఉన్న ఇళ్లలో ఉండవద్దని, గోదావరి నది పరివాహక ప్రాంతంలో జాలర్లు కాని, పశువుల కాపర్లు కాని వెళ్లకూడదని సూచించారు.

నిర్మల్ నుంచి తిరుపతి, అరుణాచలానికి బస్సు



డిపో మేనేజర్, పండరి

నిర్మల్ రూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ నుంచి తిరుపతి, అరుణాచలానికి బస్సు ట్రిప్పులు వెళుతున్నాయని డిపోమేనేజర్ పండరి అన్నారు. ఆర్టీసీ నిర్మల్ డిపో నుంచి ఈనెల 16 మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంటకు బయలుదేరి ఈనెల 17వ తేదీ ఉదయం 6 గంటలకు తిరుపతి చేరుకుంటుందన్నారు. దిగువ తిరుపతిలో శ్రీనివాస కాంప్లెక్స్‌లో సర్వదర్శనం టికెట్లు తీసుకోని వారు ఇచ్చిన టైమ్‌లో శ్రీవారి దర్శనం చేసుకోవచ్చు అని డిపో మేనేజర్ పండరి తెలిపారు. ఈ సందర్భంగా డిపోమేనేజర్ మాట్లాడుతూ... టికెట్‌లో ఉన్న టైమ్ లోపల దిగువ తిరుపతిలో గోవింద రాజుల దర్శనం, పద్మావతి అమ్మవారి దర్శనం చేసుకొని తిరుమల చేరుకొని, స్వామివారిని దర్శించుకొని, తెల్లవారి ఈ నెల 18న ఉదయం 6 గంటలకు తిరుపతి నుంచి బయలుదేరి కాణిపాకం వరాహ సిద్ధి వినాయక టెంపుల్ దర్శించుకొని, తమిళనాడులోని తిరువన్న మలై అరుణాచలేశ్వరుడి దర్శనం గిరి ప్రదక్షిణ చేసుకొని తిరిగి నిర్మల్ చేరుకుంటుందన్నారు. 5 రోజుల యాత్ర ఉంటుందని, ఒకరికి రూ.6,300ల టికెట్టు పోవడం, రావడం కలిపి ఉంటుందని, ఈ అవకాశం సద్వినియోగపరచుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9959226003, 8328021517, 7382842582లో సంప్రదించాలని ఆయన కోరారు.

ఔట్‌సోర్సింగ్ కార్మికుల నిరసన

● విధులు బహిష్కరించి ధర్నా



మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించిన పారిశుధ్య కార్మికులు

భైంసా, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం వేతనాల చెల్లింపులు చేపట్టాలని డిమాండ్ చేస్తూ భైంసా మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ పారిశుధ్య కార్మికులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఉదయం వేళలో మున్సిపల్ కార్యాలయానికి వచ్చిన ఔట్‌సోర్సింగ్ పారిశుధ్య కార్మికులు విధులను బహిష్కరించారు. అనంతరం కార్యాలయ ప్రవేశమార్గం వద్ద బైఠాయించి ధర్నాకు దిగారు. కార్మికచట్టానికి అనుగుణంగా వేతనాలను చెల్లించేంత వరకూ విధులకు హాజరుకాబోమని తేల్చిచెప్పి ఆందోళన కొనసాగించారు. సంబంధిత సమాచారం అందుకున్న మున్సిపల్ కమిషనర్ రాజేష్‌కుమార్, ఆందోళనకు దిగిన ఔట్‌సోర్సింగ్ పారిశుధ్య కార్మికులను సముదాయించేందుకు చర్యలు చేపట్టినప్పటికీ ఫలితం కానరాలేదు. సంబంధిత సమస్యలన్నింటినీ ఉన్నతాధికారులకు నివేదించి రెండు, మూడురోజుల గడువులోగా పరిష్కరిస్తానని తెలియజేసినప్పటికీ వారు ససేమిరా అని ఆందోళన యథావిధిగా కొనసాగించారు. తమకు వేతనాల చెల్లింపులు చేపట్టేలా చర్యలు తీసుకునేంత వరకు ఎలాంటి పరిస్థితుల్లోనూ విధులకు హాజరుకాబోమని వెల్లడించి ఆందోళన చేశారు. సంబంధిత సమాచారం అందుకున్న భైంసా సబ్‌కలెక్టర్ అజ్మీర సంకేత్ కుమార్ ఆదేశాల మేరకు భైంసా తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, మున్సిపల్ కార్యాలయానికి తరలివచ్చి ఔట్‌సోర్సింగ్ కార్మికులను సముదాయించారు. అయితే వారందరూ తమకు వేతనాల్లో కోతలు విధించడమే కాకుండా పీఎఫ్ ఖాతాల్లోకి సైతం డబ్బులు జమ చేయడం లేదంటూ తహసీల్దార్‌కు వివరించారు. స్పందించిన తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ సంబంధిత సమస్యల పరిష్కారం కోసం కలెక్టర్ అభిలాష అభినవ్.. సబ్‌కలెక్టర్ సంకేత్‌కుమార్ చైర్మన్‌గా ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీని నియమించిందని వెల్లడించారు. సమస్యలన్నింటినీ కమిటీకి వివరిస్తే పరిష్కరిస్తుందని సముదాయించారు. దీంతో పలువురు ఔట్‌సోర్సింగ్ కార్మికులు సబ్‌కలెక్టర్ కార్యాలయానికి తరలి వెళ్లి తమ గోడును వెళ్లబోసుకున్నారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు మధ్యాహ్నం వేళలో పారిశుధ్య కార్మికులు తమ ఆందోళనను విరమించారు. శనివారం నుంచి యథావిధిగా విధులకు హాజరవుతామని వెల్లడించారు.

పంట ధ్వంసం చేసిన అడవి పందులు



ధ్వంసమైన పంటను చూపిస్తున్న రైతు కోండ్ర రమేష్

నర్సాపూర్(జి), సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 617 సర్వే నెంబర్‌లో ఉన్న నాలుగు ఎకరాల మొక్కజొన్న పంట అడవి పందుల దాడిలో పూర్తిగా ధ్వంసమైంది. మండల కేంద్రానికి చెందిన రైతు కోండ్ర రమేష్ సాగు చేసిన పంట చేతికి వచ్చే సమయంలో అడవి పందుల గుంపు దాడి చేసి పెనునష్టాన్ని మిగిల్చింది. గురువారం రాత్రి ఈ ఘటన జరిగింది. ఈ సంఘటన గురించి ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ సాయి రెడ్డిని వివరణ కోరగా, నష్టపోయిన పంటను మండల విస్తరణ అధికారి పరిశీలించి, ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని తెలిపారు. ఈ నివేదిక ఆధారంగా రైతుకు నష్టపరిహారం అందే అవకాశం ఉంది. ఎస్ఆర్ఎస్‌పీ జలాశయం నీటి మట్టాలు పెరగడంతో అడవి పందులు పంట పొలాల వైపు వస్తున్నాయని, దీంతో పొలాలకు వెళ్లాలంటే ప్రజలు భయపడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తక్షణమే స్పందించి, పందులను తరమడానికి చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు. లేకపోతే తాము సాగు చేసిన పంటలు పూర్తిగా నాశనమవుతాయని, పెట్టుబడి కూడా తిరిగి రాదని వారు ఆందోళన చెందుతున్నారు. పంట నష్టంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయిన రైతు కోండ్ర రమేష్ ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పంట నష్టానికి తగిన పరిహారం అందిస్తేనే తమ కుటుంబాలు బతుకుతాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

రేడియోలో కడ్తాల్ పిల్లల కార్యక్రమం


సోన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కడ్తాల్ ప్రాథమిక పాఠశాలలో ఆదిలాబాద్ రేడియో కేంద్రం వారు శుక్రవారం విద్యార్థుల పాటలు, కథలు, మాటలు, నాటికలను రికార్డు చేసుకుని వెళ్లినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజుల దేవి రమేష్ బాబు తెలిపారు. ఆదివారం సాయంత్రం 5:30 నిమిషాలకు ఆదిలాబాద్ రేడియో కేంద్రం ద్వారా ప్రసారమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఆకాశవాణి సిబ్బంది వినేష్, లెనిన్, యాంకర్ కీర్తన, ఉపాధ్యాయులు మంగమ్మ, రాధ, మౌనిక, రాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి కళా ఉత్సవ్ పోటీలు విజయవంతం

నిర్మల్‌రూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని నారాయణ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన జిల్లాస్థాయి కళాఉత్సవ్ పోటీలను ప్రాంతీయ సంయుక్త సంచాలకులు వరంగల్ సత్యనారాయణ రెడ్డితో కలిసి జిల్లా విద్యాశాఖ అధికారి డి.భోజన్న సందర్శించారు. అందరు విద్యార్థులకు చదువుతో పాటు కళలలో కూడా ప్రోత్సాహం అందిస్తే వారు కళలలో చక్కగా రాణించగలుగుతారని, జిల్లాకు పేరు తెస్తారని వారు తెలిపారు. ఈ సందర్భంగా వారు పోటీలలో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించారు.

విషజ్వరాలపై కలెక్టర్ ఆరా

- వివరాలు వెల్లడించిన జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి రాజేందర్
- ఒకరికి డెంగ్యూ సోకినట్లు నిర్ధారణ



Sub:- News Item Published in Andhra Jyothi Daily News Paper "on 11-09-2025 under Caption " Vijrumbhistunna Vishajwaralu " -Submitting Rejoinder- Regarding.

With the subject cited above, it is to submit that, the News Item Published in in Andhra Jyothi Daily News Paper "on 11-09-2025 under Caption " Vijrumbhistunna Vishajwaralu ".

In this context it is to submit that, to prevent and control mosquito borne diseases "Dry day" activity has been conducting every Tuesday and Friday with 599 teams to eliminate mosquito breeding places and creating awareness on seasonal disease in the district. Till now 25358 mosquito breeding places were identified and removed 21271 breeding points, anti-larval measures taken in other breeding places. House to House Rapid Fever Survey has been conducting since 10th June 2025, till now four rounds have been completed so far 4290 fever cases detected and collected 4136 blood smears from patient and provided treatment to them.

జిల్లా వైద్యాధికారి పంపిన వివరణ

ఖానాపూర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : 'విజృంభిస్తున్న విష జ్వరాలు' శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై కలెక్టర్ అభిలాష అభినవ్ ఆరా తీశారు. దీంతో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి రాజేందర్ శుక్రవారం స్పందించారు. విస్తరిస్తున్న సీజనల్ వ్యాధుల పట్ల గురువారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన విజృంభిస్తున్న విషయ జ్వరాల కథనంపై జిల్లా వైద్యాధికారి రాజేందర్ శుక్రవారం కలెక్టర్‌కు లిఖిత పూర్వకంగా నివేదిక అందజేశారు. ఈ సందర్భంగా జిల్లాలో సీజనల్ వ్యాధుల నివారణకు చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. దోమల తయారీ ప్రదేశాలను తొలగించేందుకు రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా వారంలో రెండు రోజుల పాటు శుక్రవారం, మంగళవారం జిల్లా వ్యాప్తంగా 599 బృందాలతో డ్రై డే కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 25,358 దోమల ఉత్పత్తి ప్రదేశాలను గుర్తించి 21,271 బ్రీడింగ్ పాయింట్లను తొలగించామన్నారు. ఈ ఏడాది జూన్ 10 నుంచి ఇంటింటికి రాపిడ్ ఫీవర్ సర్వేను నిర్వహించామన్నారు. ఇప్పటికీ నాలుగు రౌండ్లు పూర్తయినా ఈ సర్వే ద్వారా జ్వరంతో బాధపడుతున్న 4,290 రోగులను గుర్తించామన్నారు. అందులో 4,136 మంది రోగుల నుంచి రక్త నమూనాలను సేకరించామన్నారు. పలువురు డెంగ్యూతో బాధపడుతున్నట్లు ఆంధ్రజ్యోతిలో పేర్కొన్న సుర్జాపూర్ గ్రామంలో సైతం గురువారం మూడు ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహించామని పేర్కొన్నారు. ఈ మూడు వైద్యశిబిరాలలో ఆయా ఆరోగ్యసమస్యలతో సతమతమవుతున్న 203 మంది రోగులను పరీక్షించినట్లు ఆయన పేర్కొన్నారు. జ్వరంతో బాధపడుతున్న 9 మంది నుంచి రక్త నమూనాలు సేకరించగా ఒకరికి డెంగ్యూ పాజిటివ్ ఉన్నట్లు నిర్ధారణ అయిందన్నారు. దీంతో గ్రామంలో దోమలను వ్యాప్తి చెందకుండా చేపట్టాల్సిన చర్యలు అన్నింటిని చేపట్టినట్లు ఆయన వివరించారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులను నివారించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని పెంబి పీహెచ్‌సీ సిబ్బందిని ఆదేశించినట్లు ఆయన పేర్కొన్నారు. అవసరమున్న చోట ఆరోగ్య శిబిరాలను సైతం నిర్వహించారని సూచించినట్లు వైద్యాధికారి రాజేందర్ స్పష్టం చేశారు.



ఆదిలాబాద్ టు కరంజి, గుబిడి రోడ్డు పరిస్థితి

రోడ్డు కోసం ఆందోళనకు సిద్ధం

- కరంజి రోడ్డు కోసం ఏకమవుతున్న గ్రామాలు
- దశాబ్దాలుగా పరిష్కారం కాని సమస్య

బీంపూర్ , సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ నుంచి గుబిడి వరకు ఉన్న 50 కిలోమీటర్ల ఉన్న రోడ్డు సమస్య ఎలాకెళ్లగా పరిష్కారం కావటం లేదు రోడ్డు మంజూరు ఉందని, కాంట్రాక్టర్ దొరకనే లేకనే నిర్మాణం కావటం లేదు అని ఒక వైపు అధికారులు ప్రజా ప్రతినిధులు చెప్పిందే చెప్తున్నారు. కనీసం బస్సులు, 108 అంబులెన్స్‌లు వెళ్లలేని గ్రామాలు ఎన్నో ఉన్నాయి. సరైన వంతెనలు లేక వారదలప్పుడు వాగులు దాటలేని పరిస్థితి ఉంది. మండలంలో కనీసం యాభై గ్రామాల ప్రజల రోడ్డు రవాణా అవసరాలు తీర్చే గుబిడి వరకు రోడ్డు నిర్మాణ దిశలో ప్రభుత్వం తక్షణం చర్యలు తీసుకోవాల్సి ఉంది.

రబీ సాగుకు శనగ విత్తనాలు సిద్ధం

బోథ్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): బోథ్ మార్కెట్ కమిటీ పరిధిలోని నేరడిగొండ, బోథ్, సోనాల, బజార్హత్నూర్ మండలాలలోని రైతులు రబీ పంట కింద సాగు చేసి సెనగ పంటకు విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి పేర్కొన్నారు. అర్హత ఉన్న డీలర్ వద్ద విత్తనాలు 15 రోజుల్లో అందుబాటులో ఉంటాయన్నారు. రైతులు ప్రభుత్వం నుండి సరఫరా విత్తనాలను ఆయా డీలర్ల వద్ద నుండి కొనుగోలు చేసుకోవాలని కోరారు.

డిజిటల్ అక్షరాస్యతపై అవగాహన

బోథ్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాలలో శుక్రవారం డిజిటల్ అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిజిటల్ లిటరసీ వల్ల కలిగే ప్రయోజనాలను సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా పదోన్నతి పై వచ్చిన కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు గజపల్లి నరసయ్యను ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా ప్రమోషన్ పొందిన అమరేందర్ రజితలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేష్, సతీష్, సిఆర్పి వెంకటరమణులు ఉన్నారు.

వర్షంలోను వైద్య శిబిరం

బీంపూర్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలం భగవాన్ పూర్‌కు శుక్రవారం బీంపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య సిబ్బంది మంద పల్లె వాగు దాటి ఆ తర్వాత కాలినడకన వెళ్లారు. అక్కడ వర్షంలో కూడా వైద్య శిబిరం నిర్వహించి పరీక్షలు చేసి మందులు ఇచ్చారు. ఈ వర్ష కాల నేపథ్యంలో గిరిజన గ్రామాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. ఆయనతో మండల ఆరోగ్య విస్తీరణ అధికారి జ్ఞానేశ్వర్, విష్ణు, రోహిదాస్ తదితరులు ఉన్నారు.

క్రమశిక్షణతో కూడిన శిక్షణ అవసరం

తలమడుగు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణతో కూడిన శిక్షణ ఎంతో అవసరమని ఎన్‌సీసీ సుబేదార్ రవి సహాబ్ అన్నారు. శుక్రవారం అదిలాబాద్ జిల్లాలోని తలమడుగు మండలం సుంకిడి ఫైరింగ్ శిక్షణ కేంద్రంలో ఎన్‌సీసీ మూడు రోజుల శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌సీసీ విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన శిక్షణను ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇందులో ఎన్‌సీసీ అధికారులు రవి, సాహో, రాజేంద్రప్రసాద్ ఎన్‌సీసీ శిక్షణ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ కార్యవర్గం ఏర్పాటు

సారంగాపూర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : సారంగాపూర్ మండల విశ్వబ్రాహ్మణ కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యవర్గం అధ్యక్షులుగా తుపాకుల వెంకటరమణ చారి, కోశాధికారిగా నర్శయ్య చారి, కార్యదర్శిగా తోట ధనుంజయ్‌చారిలతో పాటు మరో 18 మందిని సభ్యులుగా ఎన్నుకున్నట్లు జల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు దూరిశెట్టి మూటపెల్లి బ్రహ్మయ్య తెలిపారు.

బాధిత కుటుంబసభ్యులకు చెక్కుల అందజేత

ముథోల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తరోడా గ్రామానికి చెందిన టోక్రే కాశీనాథ్, అఫ్జఖాన్‌లు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. తెలంగాణ గ్రామీణ బ్యాంకు ప్రధానమంత్రి జీవనజ్యోతి పథకం కింద ఇన్సూరెన్స్ చేసుకోవడంతో వారికి ఒక్కొక్కరికి రెండులక్షల రూపాయల చెక్కును వారి కుటుంబసభ్యులకు తరోడా గ్రామ సంఘం ఆధ్వర్యంలో బ్యాంకుమేనేజర్ నరేష్, ఏపీఎం గురుచరణ్ అందజేశారు.

బదిలీపై వెళ్లిన సీసీకి సన్మానం

ముథోల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తరోడా క్లస్టర్ సీసీ పోశెట్టి బదిలీపై తానూర్ మండలానికి వెళ్లారు. ఈ సందర్భంగా తరోడా గ్రామ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఏపీఎం గురుచరణ్ శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌మేనేజర్ నవీన్, సీసీ గోదావరి, గ్రామ సంఘ అధ్యక్షుడు శనిగారం ముత్తుబాయి. కార్యదర్శి కదం అనసూయ బాయి పాల్గొన్నారు.

'మహిళలు ఆర్థికంగా ఎదగాలి'

ఖానాపూర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : చిరు ధాన్యాలను 'సిరి' ధాన్యాలుగా మార్చుకుని మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలని ఖానాపూర్ మున్సిపల్ కమిషనర్ సుందర్ సింగ్, నిర్మల్ జిల్లా మెప్మా పీడీ సుభాషిణి అన్నారు. శుక్రవారం ఖానాపూర్‌లోని మెప్మా కార్యాలయ ఆవరణలో ఈడీఐఐ ఆధ్వర్యంలో ఆగ్రో మిల్లెట్స్ అండ్ ఫుడ్ ప్రాసెసింగ్ ప్రోడక్ట్‌పై అభ్యర్థుల ఎంపిక కార్యక్రమాన్ని నిర్వహించారు. మెప్మా సీవో స్రవంతి, రవీందర్, దేవేందర్, రవి, అలేఖ్య, తదితరులున్నారు.

యోగా పోటీలకు శిశు మందిర్ విద్యార్థి

ముథోల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం తానూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి యోగాసన పోటీల్లో ముథోల్ మండల కేంద్రంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో చోర్మారే గీతేష్ అనే విద్యార్థి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానాచార్యులు సారథి రాజు తెలిపారు.

మత్తుతో జీవితం చిత్తు చేసుకోవద్దు

తానూర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : యువత మత్తుకు దూరంగా ఉండాలని మోటివేషనల్ స్పీకర్ వాడేకర్ లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రం తానూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు యాంటీడ్రగ్స్‌పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు.కార్యక్రమానికి కళాశాల సిబ్బంది విద్యార్థులు, కళాశాల యాంటీడ్రగ్స్ కమిటీ, సి.విజయ్‌కుమార్ రాజశేఖర్‌లున్నారు.

మహిళ అదృశ్యం

తానూర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఝరి(బి) గ్రామానికి చెందిన రాథోడ్ తారాబాయి (46) అనే మహిళ అదృశ్యం అయినట్లు ఎస్సై షేక్‌జుబేర్ తెలిపారు. తారాబాద్ ఈ నెల 10వ తేదీ బుధవారం ఉదయం 9గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్ళి, తిరిగి రాలేదని, దీంతో ఆమె భర్త రాథోడ్ దిగంబర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అదృశ్యం కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

దాబాలో ఆకస్మిక తనిఖీలు

నిర్మల్ రూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండాపూర్‌లో గల వెంకటేశ్వర దాబాను ఆకస్మికంగా తనిఖీ చేసినట్లు రూరల్ ఎస్సై లింబాద్రి తెలిపారు. ఎస్సై మాట్లాడుతూ... దాబాలో సిట్టింగ్ నడవడం వలన యజమానిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఎస్‌బీఐలో రూ.50 లక్షల

నకిలీ బంగారం స్కామ్

- గోల్డ్‌స్మిత్ ప్రమేయంపై అనుమానాలు
- నిర్మల్ జిల్లా నర్సాపూర్ బ్యాంకులో వెలుగులోకి..
- రాత్రి పొద్దుపోయిన తర్వాతా కొనసాగుతున్న విచారణ



నర్సాపూర్ బ్యాంకులో గోల్డ్‌స్మిత్ స్నేహితులను విచారిస్తున్న అధికారులు

నర్సాపూర్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లా నర్సాపూర్ మండల కేంద్రంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ)లో భారీ గోల్డ్‌లోన్ మోసం వెలుగులోకి వచ్చింది. శుక్రవారం హైదరాబాద్ నుంచి వచ్చిన ప్రత్యేక తనిఖీ బృందాలు సుమారు రూ. 50 లక్షల విలువైన నకిలీ బంగారానికి రుణాలు ఇచ్చినట్లు గుర్తించాయి. ఈ స్కామ్‌లో బ్యాంకు సిబ్బంది, బయటి వ్యక్తుల ప్రమేయంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బ్యాంకులో నకిలీ బంగారాన్ని తాకట్టు పెట్టి రుణాలను తీసుకున్నారని, యాసిడ్ పరీక్షల్లో బంగారం స్వచ్ఛత (ప్యూరిటీ) 50శాతం కన్నా కన్నా తక్కువగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈ మోసంలో ప్రశాంత్ అనే గోల్డ్‌స్మిత్ తన స్నేహితులతో కలిసి నకిలీ బంగారానికి రుణాలు తీసుకున్నట్లు సమాచారం. ఈ విషయంలో అందరినీ పిలిపించి విచారిస్తున్నారు. శనివారం రాత్రి పొద్దుపోయిన తర్వాత కూడా విచారణ కొనసాగింది. గతంలో బంగారం స్వచ్ఛతను తనిఖీ చేసే గోల్డ్‌స్మిత్‌ను తొలగించిన తర్వాతే ఈ మోసం జరిగిందని గ్రామస్థులు అంటున్నారు. ఇది ఈ మోసంలో బ్యాంకు సిబ్బంది హస్తంపై కూడా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ మోసంలో ఇద్దరు వ్యక్తులు ప్రధానంగా ఉన్నారని గ్రామస్థులు చెబుతున్నారు. వీరు బ్యాంకు సిబ్బందిని మోసం చేసి నకిలీ బంగారానికి రుణాలు పొందారని తెలుస్తోంది. దాదాపు 50 ఏళ్లుగా ఎలాంటి మోసాలు జరగని ఈ బ్యాంకులో ఇప్పుడు ఈ సంఘటన జరగడంపై ఖాతాదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల బ్యాంకుపై నమ్మకం సన్నగిల్లుతుందని వారు అంటున్నారు. ఈ కేసు విచారణ శనివారం మధ్యాహ్నం వరకు కొనసాగనుంది. పూర్తి విచారణ తర్వాత మరింత సమాచారం వెల్లడయ్యే అవకాశం ఉంది.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరిస్తా

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ హామీ
- ఎమ్మెల్యేకు అంగన్వాడీ టీచర్ల మెమోరాండం

ఉట్నూర్, సెప్టెంబర్ 12(ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ టీచర్ల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ హామీ ఇచ్చారు. ఖానాపూర్ డివిజన్ లోని అంగన్వాడీ కార్యకర్తలు శుక్రవారం ఉట్నూరు మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి మెమోరండం అందజేశారు. ఖానాపూర్ ప్రాజెక్టుకు రెగ్యులర్ సీడీపీవోను నియమించాలని, ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీ మేరకు నెలసరి జీతం రూ.18 వేలకు పెంచాలని, అంగన్వాడీ కార్యకర్తలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కోరారు. వారి సమస్యలను విన్న ఎమ్మెల్యే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



ఎమ్మెల్యే బొజ్జుపటేల్‌కు మెమోరాండం సమర్పిస్తున్న అంగన్‌వాడీలు

రైతు నేస్తం ద్వారా రుణాలు

● డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్

తాంసి రూరల్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): రైతు నేస్తం పథకం ద్వారా సహకార బ్యాంకుల్లో ఎకరానికి మూడు లక్షల రుణాలు అందిస్తున్నామని ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. శుక్రవారం తాంసి మండల కేంద్రంలోని సహకార సొసైటీ కార్యాలయంలో పాలకవర్గ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 8 కోట్లు ఉన్న బ్యాంకు లావాదేవీలను ఐదేళ్లలో 1840 కోట్లకు పెరిగింది అన్నారు. ప్రతిరోజు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 100 కోట్ల రుణాలను రైతులకు అందిస్తున్న ఘనత సహకార సొసైటీలదేనన్నారు. ఈ కార్యక్రమంలో సీఈఓ కేశవ్, వైస్ ప్రెసిడెంట్ ధనంజయ్, కార్యదర్శులు సుధాకర్, ఇంతియాజ్, సిద్ధూ, ఆశన్న, సహకార సొసైటీ సంఘ సభ్యులు సామ సంతోష్ రెడ్డి, రమేష్ యాదవ్, భూమారెడ్డి తదితరులు ఉన్నారు.

డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు



నృత్యాలు చేస్తూ సందడి చేసిన విద్యార్థినులు

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో సాగాయి. శుక్రవారం నిర్వహించిన వేడుకల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పలువురు విద్యార్థులు సినీ గీతాలకు తగ్గట్లు నృత్యాలు చేస్తూ సందడి చేశారు. తోటి విద్యార్థుల కేరింతలు, చప్పట్ల నడుమ వేడుకలు కన్నుల పండువగా సాగాయి. కళాశాల ప్రిన్సిపాల్ అతిక బేగంతో పాటు అధ్యాపకులు పాల్గొన్నారు. విద్యార్థుల నృత్య ప్రదర్శనలను ఆసక్తిగా తిలకించి వారిని అభినందించారు. ఫ్రెషర్స్ డే వేడుకలతో కళాశాల ప్రాంగణంలో కోలాహలంగా వాతావరణం కనిపించింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఫ్రెషర్స్ డే కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

ఎమ్మెల్యేను ఆహ్వానించిన ఉపాధ్యాయులు

ఉట్నూర్, సెప్టెంబర్12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్న పాఠశాల ఆరోగ్య కార్యక్రమానికి రావాలని ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్‌ను హెచ్ఎం శీతల్ చౌహాన్ శుక్రవారం ఆహ్వానించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు బాలికల ఉండగ పాఠశాలలో విద్యార్థుల ఉన్నతమైన భవిష్యత్తుపై ఆర్యోగకరమైన అలవాట్లు అనేక కార్యక్రమంలో కలెక్టర్ ఆదేశానుసారము ఎమ్మెల్యేను ఆహ్వానించామన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

నేరడిగొండ, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ఫోటో గ్రాఫర్స్ వీడియో గ్రాఫర్స్ అసోషియేషన్ హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న ఫొటో ట్రేడ్ హైదరాబాద్ ఎక్స్పో పోస్టర్లను ఆదిలాబాద్ ఫోటో అసోసియేషన్ సభ్యులు శుక్రవారం నెరడిగొండ మండల కేంద్రంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌చే పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫోటో గ్రాఫర్ల సంఘం అధ్యక్షులు దొడ అశోక్, ఉపా అధ్యక్షులు ముప్కాల ప్రవీణ్ ఉన్నారు.

ఎమ్మెల్యే కప్ విజేతలకు బహుమతుల అందజేత

నేరడిగొండ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జడ్పీ పాఠశాలలో గత మూడు రోజుల నుంచి జరుగుతున్న ఎమ్మెల్యే కప్ సాఫ్ట్ బాల్ టోర్నమెంట్‌లో విజయం సాధించిన క్రీడాకారులకు శుక్రవారం ఆదిలాబాద్ సాఫ్ట్ బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సొంత డబ్బులతో బహుమతులు, ట్రోఫీలను అందజేశారు. ఈ సందర్భంగా సాఫ్ట్ బాల్ గర్ల్స్‌లో బుగ్గరం విద్యార్థినులు మొదటి బహుమతి, రెండో బహుమతిగా నేరడిగొండ విజయం సాధించగా బాలురలో నెరడిగొండ మొదటి బహుమతి రెండవ బహుమతి సాధించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సహజమని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పద్మ, సాఫ్ట్ బాల్ సెక్రటరీ గంగాధర్, బుగ్గరం ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణవేణి, పిడీలు రమణ, అఖిల్, మమత, పిటి గంగమని, నాగరాజు, శ్యామ్, అనిల్, గణేష్, సాయి కిరణ్ ఉన్నారు.

చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలి

● రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుభాష్

ఉట్నూర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 16న హైదరాబాద్‌లో జరిగే ధర్నా కార్యక్రమానికి మెడికల్ హెల్త్ అండ్ ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్ట్ ఉద్యోగులందరు పెద్ద ఎత్తునతరలి రావాలని తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్టు ఎంప్లాయిస్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొంకంటి సుభాష్ అన్నారు.

ఇళ్ల నిర్మాణాన్ని పూర్తిచేయండి



ఖానాపూర్‌లో మాట్లాడుతున్న అధికారి

ఖానాపూర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఖానాపూర్ మండలంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని వేగంగా పూర్తిచేయాలని మండల ప్రత్యేకఅధికారి జీవరత్నం అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో సమావేశ మందిరంలో శుక్రవారం ఆయా గ్రామాల ప్రత్యేక అధికారులతో, పంచాయతీ కార్యదర్శులతో, వార్డు ఆఫీసర్లతో, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం మేస్త్రీలతో ప్రత్యేక సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. మండలంలోని తర్లపాడ్ గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లలో రెండు ఇళ్ల తాలూకు స్లాబ్‌లను వేగంగా వేయించడం అభినందనీయమని మండల ప్రత్యేక అధికారి జీవరత్నం, ఎంపీడీవో రత్నాకర్ రావు అన్నారు. అందుకు కృషి చేసిన గ్రామానికి చెందిన ఇందిరమ్మ కమిటీ సభ్యుడు నర్సయ్యను అభినందించారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ రాజేశ్వర్, ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ స్వామి ఉన్నారు.

కుభీర్ : ఇందిరమ్మ ఇళ్లనిర్మాణ పనులు లబ్ధిదారుల సకాలంలో పూర్తిచేయాలని అధికారులు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని జీపీ కార్యాలయంలో ఇందిరమ్మ లబ్ధిదారులకు సమావేశం నిర్వహించారు. లబ్ధిదారులు ఇళ్లనిర్మాణాలు త్వరితగతిన నాణ్యత ప్రమాణాలతో పూర్తిచేయాలని సూచించారు. కార్యక్రమంలో జీపీ కార్యదర్శి విజయ్‌కుమార్, ఐకేపీ సిబ్బంది దత్తాత్రి, భూమన్న, కారోబారి ప్రకాష్, ఏఎంసీ మాజీ చైర్మన్ సంతోష్, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చెంచులకు ఇళ్లు ఇవ్వాలని వినతి

కడెం : మండలంలోని లింగాపూర్‌లో 70 ఏళ్లుగా ఇళ్లు లేని నిరుపేద ఆదిమా గిరిజనులకు ఇందిరమ్మ ఇళ్లు ప్రభుత్వం నిర్మించి ఇవ్వాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జుపటేల్, ఐటీడీఏ పీవోకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సీపీఐ ఖానాపూర్ డివిజన్ కార్యదర్శి సునారికారి రాజేష్ మాట్లాడుతూ... కడెం మండలంలోని లింగాపూర్ గ్రామంలో ఆదిమా గిరిజనులు, చెంచులు గత 70 సంవత్సరాల నుంచి జీవిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షులు లింగన్న, అడ్వకేట్ ఎన్. జాకబ్, ఎన్.లలితా కుమారి, చెంచుల శిరీష, చంద్రకళ, పూజిత, లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్(జి) : ఇందిరమ్మ ఇళ్ల మార్కెట్, నిర్మాణపురోగతిపై మండల కేంద్రంలోని ఈజీఎస్ కార్యాలయంలో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి అయిన జిల్లా వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. సమీక్ష సమావేశంలో మండల తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీవో పుష్పలత, ఎంపీవో తిరుపతి రెడ్డి, ఏపీఎం, సీసీలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల పహారాలో యూరియా పంపిణీ

నిర్మల్ రూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిట్యాల గ్రామంలో గల అభయ కృషి ఫార్మర్స్ ప్రొడ్యూసింగ్ కంపెనీ లిమిటెడ్‌లో బుధవారం పోలీసుల పహారా మధ్య యూరియా 450 బస్తాల పంపిణీ కొనసాగింది. శుక్రవారం యూరియా కోసం అధిక సంఖ్యలో రైతులు రావడంతో రైతులకు ఒక్కొక్కరికి రెండు బస్తాల చొప్పున అందజేశారు. ఉదయమే వచ్చిన రైతులు యూరియా కోసం చాలా సమయం నిరీక్షించారు. రైతులకు ఓపిక లేక ఆధార్ కార్డులను వరుస క్రమంలో పెట్టినట్లు రైతులు తెలిపారు. రైతుల మధ్య తోపులాట జరగకుండా రూరల్ ఎస్సై లింబాద్రి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.



యూరియా పంపిణీ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన బందోబస్తు



కలెక్టరేట్ కార్యాలయంలో గుమ్మిగూడిన ఉద్యోగులు

కలెక్టరేట్ @ 84

(3వ పేజీ తరువాయి...)

నేలమట్టమైంది. బాల్కనీ వరండాలో భద్రపరిచిన బీరువాలు, ఇతర రికార్డులపై భవన శిథిలాలు పడి కనిపించకుండానే పోయాయి. ఎప్పటి మాదిరిగానే ఉద్యోగులు శుక్రవారం ఉదయం కలెక్టరేట్ కార్యాలయానికివచ్చారు. కూలిన శిథిలాలను చూసి భయాందోళనకు గురయ్యారు. ఈ విభాగాల్లో పని చేసేందుకు పూర్తిగా అవకాశం లేకుండా పోవడంతో ఉద్యోగులకు సెలవును ప్రకటించారు. అంతేకాకుండా కార్యాలయానికి వచ్చిన ఉద్యోగులు కొద్దిసేపటికే వెనుదిరిగి వెళ్లి పోయారు. రెండవ అంతస్తు పైకి ఎవరూ వెళ్లకుండా గేటుకు తాళం వేసి కట్టడి చేశారు.

నిపుణులతో కమిటీ

కలెక్టరేట్ నిర్మాణం కుప్పకూలడంపై ఇంజనీరింగ్ నిపుణులతో కమిటీని నియమించారు. ఇందులో ఆర్అండ్‌బి ఇంజనీరింగ్ అధికారులతో పాటు జేఎన్‌టీయూ, రిటైర్డ్ ప్రొఫెసర్, ప్రముఖ కన్సల్టెన్సీ అధికారులు ఉన్నారు. కలెక్టరేట్ భవనంలో కూలిన శిథిలాలను పరిశీలించారు. టెస్టింగ్ కోసం నమునాలను సేకరించారు. నాన్ డిస్ట్రక్టివ్ టెస్టింగ్ (ఎన్‌డీటీ) టెస్టు అనంతరం మరమ్మతులు చేయడం లేదా పూర్తిగా భవనాన్ని కూల్చి వేయడంపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఇంకేమైనా పగుళ్లు, లోపాలు ఉన్నాయా అనే దానిపై అధికారు లు పరిశీలిస్తున్నారు. అప్పట్లో దీనిని పూర్తిగా డంగుసున్నం, ఇటుకలతో నిర్మించారు. అయితే ఒకటి రెండు రోజుల్లో కమిటీ నిర్ణయంపై స్పష్టత వచ్చే అవకాశం కనిపిస్తుంది.

నత్తనడకన పనులు

జిల్లా కలెక్టర్ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో అన్ని జిల్లాల మాదిరిగానే జిల్లాలోను నూతన కలెక్టరేట్ భవన సముదాయాన్ని నిర్మించేందుకు గత ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 44వ జాతీయ రహదారిని ఆనుకుని భట్టిసావర్గాం శివారులో కొత్త కలెక్టరేట్ కార్యాలయాన్ని నిర్మించేందుకు ప్రభుత్వం రూ.55 కోట్ల నిధులను మంజూరు చేసింది. దీంతో గత రెండేళ్ల క్రితమే ఆర్అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో నిర్మాణ పనులను ప్రారంభించారు. ఇప్పటి వరకు కేవలం 15 శాతం పనులే పూర్తయినట్లు అధికారులు పేర్కొంటున్నారు. నిధుల విడుదలలో తీవ్రజాప్యం జరుగడంతో కొత్త కలెక్టరేట్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఇది వరకు రూ.28 కోట్ల బిల్లులను సంబంధిత కాంట్రాక్టరుకు చెల్లించినట్లు తెలుస్తుంది. నూతన కలెక్టర్ కార్యాలయం పూర్తయ్యేందుకు మరో రెండేళ్ల పాటు సమయం పట్టే అవకాశం ఉందని ఆర్అండ్‌బి ఈఈ నర్సయ్య తెలిపారు.

కమిటీ నివేదిక మేరకే నిర్ణయం

: రాజర్షిషా, జిల్లా కలెక్టర్, ఆదిలాబాద్



జిల్లా కలెక్టరేట్ మార్పు, మరమ్మతులపై నిపుణుల కమిటీ నివేదిక మేరకే నిర్ణయం తీసుకునే అవకాశం ఉంటుంది. భవన నిర్మాణం కూలిన ఘటనలో ప్రాణనష్టం జరగక పోవడం అదృష్టంగా భావిస్తున్నాం. ఉద్యోగుల భద్రతకే తొలి ప్రాధాన్యతనిస్తాం. నూతన కలెక్టరేట్ భవన నిర్మాణానికి సంబంధించిన బిల్లులు ఇటీవలే క్లియర్ చేయడం జరిగింది. పనులను వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రత్యామ్నాయంగా జడ్పీ లేదా పాత మున్సిపల్ కార్యాలయాలు అందుబాటులో ఉన్నాయి. ఉద్యోగులు ఎలాంటి భయాందోళన చెందాల్సిన అవసరం లేదు.

కాంగ్రెస్‌లోకి భారీగా చేరికలు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న శ్రీహరి రావు

నర్సాపూర్(జి), సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రేవంత్ రెడ్డి సారథ్యంలో నడుస్తున్న ప్రజా పాలనను చూసి ఇతర పార్టీల నేతలు కాంగ్రెస్ వైపు ఆకర్షితులవుతున్నారని డీసీసీ అధ్యక్షులు శ్రీహరి రావు అన్నారు. నర్సాపూర్ మండలంలోని కుస్లి గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నేత నార్వాడి గణేష్ పటేల్ ఆధ్వర్యంలో సుమారు 50 మంది కార్యకర్తలు శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి శ్రీహరి రావు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ఇంద్రకరణ్ రెడ్డి, ఉమా మహేశ్వర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ అజీమ్, కుస్లి మాజీ ఎంపీటీసీ భోజన్న, బాలాజీ, సాయిబాబా, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్‌లో ఉన్న జీతాలు వెంటనే విడుదల చేయాలి

కడెం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ కార్మికులకు రెండు నెలలుగా జీతాలు పెండింగ్‌లో ఉన్నాయని కార్మికులు నిరసన చేపట్టారు. మండల పంచాయతీ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బీసీ రాష్ట్ర కార్యదర్శి రమణ యాదవ్‌తో కడెం ఎంపీడీవో కార్యాలయం ముందు నిరసన తెలియజేస్తూ ఎంపీడీవో అరుణకు వినతి పత్రాన్ని అందజేశారు.

విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

దస్తురాబాద్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలంటే వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఆరోగ్యవిస్తరణ అధికారి శైలేంద్ర కన్నయ్య సూచించారు. మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో శుక్రవారం మెడికల్‌క్యాంప్ నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బత్తుల విశ్వంబర్, మండల విద్యాధికారి గంగాధర్, పాఠశాల ఎస్‌వో తిరుమల, హెల్త్ సూపర్‌వైజర్ సంతోష్, హెల్త్ అసిస్టెంట్ మల్లేష్, ఏఎన్ఎం గంగామణి, ఆశావర్కర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా కవులను గుర్తించాలి

నిర్మల్‌రూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం జిల్లా కవులను గుర్తించాలని జిల్లా కవులు, రచయితలు అన్నారు. శుక్రవారం నిర్మల్ ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు. జిల్లాలో వచన కవిత్వం, పద్యకవిత్వం, వ్యాసాలు, కథలు, కథానికలు, తాత్వికవ్యాసాలు రాసిన చేయి తిరిగిన కవులు, రచయితలు ఎంతో మంది ఉన్నారన్నారు. వారి రచనలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో ప్రసిద్ధి చెందాయని పేర్కొన్నారు. అంతేకాకుండా ఎక్స్‌రే, రంజని కుందుర్తి, సినారే అవార్డులు అందుకున్న కవులు కూడా ఇక్కడ ఉన్నారని తెలిపారు. నాలుగు దశాబ్దాలుగా సాహిత్యాన్ని శ్వాసగా చేసుకొని రచనలు రాస్తున్నారన్నారు. కానీ ప్రభుత్వం వీరిని గుర్తించకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం ఒకటి రెండు బుక్కులు రాసిన కవులకు ఆదరిస్తుంది కానీ, దశాబ్దాలుగా ఎన్నో బుక్కులను రాసిన వారిని గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

కోతుల నుంచి రక్షించండి

కడెం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో కోతుల బెడదను అరికట్టాలని మహిళలు కోరారు. కోతులు తమ ఇంటిలో నిత్యావసర వస్తువులు, చిన్నపిల్లల మీద, మహిళల మీద దాడి చేస్తున్నాయని తహసీల్దార్ ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఇళ్లవద్ద కోతులు గుంపులు గుంపులుగా తిరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

స్టార్లతో కళకళ

నేటినుంచి వరల్డ్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్

భారత్ ఆశలన్నీ నీరజ్‌పైనే


నీరజ్

స్టార్ నెట్‌వర్క్‌లో ప్రత్యక్ష ప్రసారం


డుప్లాంటిస్

టోక్యో: ఒలింపిక్స్ తర్వాత అథ్లెటిక్స్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మకమైనది ప్రపంచ చాంపియన్‌షిప్స్. విశ్వవ్యాప్త ప్రఖ్యాత అథ్లెట్ల సత్తాకు పరీక్షగా నిలిచే ఈ చాంపియన్‌షిప్స్ శనివారం టోక్యోలో ప్రారంభం కానున్నాయి. ఈనెల 21 వరకు జరిగే పోటీలలో 200 జట్ల నుంచి 2000 మంది అథ్లెట్లు తలపడుతున్నారు. 49 విభాగాలలో మొత్తం 147 పతకాలకోసం హోరాహోరీ పోరు జరగనుంది. షెల్లీ ఆన్ ఫ్రేజర్ ప్రైస్, షకారీ రిచర్డ్‌సన్, నోవా లైల్స్, కిషానే థాంప్సన్, సిడ్నీ మెక్ లాలిన్, అర్మాండ్ డుప్లాంటిస్, నీరజ్ చోప్రా వంటి మేటి అథ్లెట్లు ఫ్యాన్స్‌ను అలరించనున్నారు.

నేటి భారత షెడ్యూల్

ఉ. 4 గం.: పురుషుల 35 కి.మీ. రేస్ వాక్-రాంబాబు, సందీప్; మహిళల 35 కి.మీ. రేస్‌వాక్-ప్రియాంక గోస్వామి

సా. 4.30: మహిళల 1500 మీ. హీట్-పూజ

షెల్లీ ఘనంగా ముగిస్తుందా..?

ఈసారి వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో జమైకా స్ప్రింట్ దిగ్గజం, మహిళల 100 మీ. స్ప్రింట్ రారాణి షెల్లీ ఆన్ ఫ్రేజర్ ప్రైస్‌పై అందరి దృష్టి నిలిచింది. 38 ఏళ్ల స్టార్ ఈ పోటీల తర్వాత ట్రాక్ నుంచి రిటైర్ కానుంది. మూడు ఒలింపిక్, 10 ప్రపంచ చాంపియన్‌షిప్స్ స్వర్ణ పతకాల విజేత షెల్లీ టైటిల్‌తో ఘనమైన వీడ్కోలు తీసుకోవాలని భావిస్తోంది. అలాగే మహిళల 100, 200 మీ.లలో అమెరికన్ క్వీన్ షకారీ రిచర్డ్‌సన్ ప్రధాన ఆకర్షణ కానుంది. గత వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో నెగ్గిన 100 మీ. టైటిల్‌ను నిలబెట్టుకోవాలని రిచర్డ్‌సన్ పట్టుదలగా ఉంది. గాయాలతో సతమతమవుతున్న పురుషుల 100.మీ., 200 మీ.ల డిఫెండింగ్ చాంపియన్ నోవా లైల్స్ (అమెరికా) టైటిళ్లు నిలబెట్టుకుంటాడేమో చూడాలి. సీజన్‌లో అద్భుత ఫామ్‌లో ఉన్న జమైకా స్ప్రింటర్ కిషానే థామ్సన్..నోవాకు గట్టి పోటీ ఇవ్వనున్నాడు. బరిలో దిగిన ప్రతి టోర్నీలో రికార్డులు నమోదు చేస్తున్న పురుషుల పోల్‌వాల్ట్ మొనగాడు అర్మాండ్ డుప్లాంటిస్ టోక్యోలో నెలకొల్పే రికార్డుపై ఉత్కంఠ ఏర్పడింది. ఇంకా భారత స్టార్ నీరజ్ చోప్రా, మహిళల 400 మీ. హర్డిల్స్‌లో ప్రపంచ రికార్డు గ్రహీత సిడ్నీ మెక్‌లాలిన్ (అమెరికా), మహిళల 1500, 5వేల మీ.లలో కిప్‌యేగాన్ (కెన్యా) మెరుపులు చూసి తీరాల్సిందే.

టైటిల్‌పై నీరజ్ గురి

భారత్ ఆశలన్నీ సూపర్ స్టార్ నీరజ్ చోప్రాపైనే నిలిచాయి. 2023 బుడాపెస్ట్ ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో జావెలిన్ పసిడి పతకంతో చరిత్ర సృష్టించిన నీరజ్.. ఆ టైటిల్‌ను నిలబెట్టుకోడమే ధ్యేయంగా బరిలోకి దిగుతున్నాడు. అయితే పాకిస్థాన్‌కు చెందిన ఒలింపిక్ చాంపియన్ అర్షద్ నదీమ్, చెక్ త్రోయర్ జాకబ్ వాల్డెచ్‌ల నుంచి నీరజ్‌కు తీవ్రమైన పోటీ ఎదురుకానుంది. ఇక..మొత్తం 19 మంది అథ్లెట్ల భారత బృందం టోక్యోలో తలపడుతోంది. కానీ పతక ఆశలు మాత్రం నీరజ్‌పైనే నిలిచాయి. ఈనెల 17న జావెలిన్ ఈవెంట్ మొదలు కానుంది. భారత్ నుంచి అన్నూరాణి (మహిళల జావెలిన్), పారుల్ చౌధరి (3000మీ స్టీపుల్ చేజ్), మురళీ శ్రీశంకర్ (లాంగ్ జంప్), గుల్వీర్ సింగ్ (5000మీ.), ప్రవీణ్ చిత్రవేల్ (ట్రిపుల్ జంప్) కూడా బరిలో ఉన్నారు.


దక్షిణేశ్వర్ సురేష్

తొలిరోజు మనదే

● సింగిల్స్‌లో దక్షిణేశ్వర్, సుమిత్ గెలుపు

● భారత్ 2-0 ● స్విట్జర్లాండ్‌తో డేవిస్ కప్

బీల్ (స్విట్జర్లాండ్): డేవిస్ కప్ వరల్డ్ గ్రూప్-1లో భాగంగా ఆతిథ్య స్విట్జర్లాండ్‌తో పోరులో తొలిరోజు భారత్‌దే పైచేయి అయింది. శుక్రవారం జరిగిన సింగిల్స్, రివర్స్ సింగిల్స్ మ్యాచుల్లో భారత ఆటగాళ్లు గెలవడంతో 2-0 ఆధిక్యం లభించింది. అయితే, ప్రధానంగా తొలిసారి డేవిస్ కప్ ఆడుతున్న తమిళనాడుకు చెందిన దక్షిణేశ్వర్ సురేష్ తనకంటే మెరుగైన ర్యాంకరైన ప్రత్యర్థిని ఓడించడం మొదటిరోజు ఆటలో విశేషం. తొలి సింగిల్స్‌లో 626వ ర్యాంకర్ దక్షిణేశ్వర్ 7-6 (5), 6-3తో 155వ ర్యాంకరైన జెరోమ్ కిమ్‌ను చిత్తు చేసి సంచలనం సృష్టించాడు. అనంతరం జరిగిన రివర్స్ సింగిల్స్‌లో అనుభవజ్ఞుడైన సుమిత్ నగల్ 6-3, 7-6(4)తో మార్క్ అండ్రియా హస్లెర్‌పై గెలిచి భారత్‌కు 2-0 ఆధిక్యాన్ని అందించాడు. ఇక, శనివారం జరిగే డబుల్స్ మ్యాచ్‌లో శ్రీరామ్ బాలాజీ/బొల్లిపల్లి రిత్విక్ చౌదరి జోడీ బరిలోకి దిగనుంది.

ఫైనల్‌కు జైస్మిన్


జైస్మిన్

సెమీస్‌లో మీనాక్షి ● ప్రపంచ బాక్సింగ్

లివర్‌పూల్ (ఇంగ్లండ్): ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్స్‌లో భారత బాక్సర్ జైస్మిన్ లంబోరియా ఫైనల్ చేరింది. మహిళల 57 కిలోల విభాగం సెమీస్‌లో జైస్మిన్ 5-0తో ఒమైలిన్ అల్కాలా (వెనెజులా)ను చిత్తుచేసి కనీసం రజతం ఖాయం చేసుకుంది. మరో అమ్మాయి మీనాక్షి హుడా సెమీస్ చేరడంతో భారత్ ఖాతాలో మరో పతకం ఖరారైంది. 48 కిలోల విభాగం క్వార్టర్‌ఫైనల్లో మీనాక్షి 5-0తో అలైస్ పంప్రే (ఇంగ్లండ్)ను ఓడించింది. ఇక..పురుషుల విభాగంలో భారత్ పోరు ముగిసింది. బరిలో మిగిలిన జాదుమని సింగ్ 50 కిలోల కేటగిరీ క్వార్టర్‌ఫైనల్లో సాంఝర్ (కజకిస్థాన్) చేతిలో 0-4తో పరాజయం పాలయ్యాడు.

పాక్ శుభారంభం

ఒమన్‌పై ఘనవిజయం

ఆసియా కప్‌లో నేడు

బంగ్లాదేశ్ x శ్రీలంక

రాత్రి 8 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో..


మహ్మద్ హరీస్ (66)

దుబాయ్: భారత్‌తో మ్యాచ్‌కు ముందు పాకిస్థాన్ జట్టు కూడా ఆత్మవిశ్వాసాన్ని పెంచుకుంది. ఆసియా కప్‌లో భాగంగా శుక్రవారం గ్రూప్ 'ఎ'లో ఒమన్‌తో జరిగిన మ్యాచ్‌లో 93 పరుగుల తేడాతో నెగ్గింది. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' మహ్మద్ హరీస్ (43 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సర్లతో 66) అర్ధసెంచరీతో ఆకట్టుకున్నాడు. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పాక్ ఆరంభంలో తడబడినా.. చివరకు 20 ఓవర్లలో 7 వికెట్లకు 160 పరుగులు సాధించింది. ఓపెనర్ సహిబ్జాద ఫర్హాన్ (29), ఫఖర్ జమాన్ (23 నాటౌట్), మహ్మద్ నవాజ్ (19) ఫర్వాలేదనిపించారు. పేసర్ షా ఫైజల్, స్పిన్నర్ ఆమిర్ కలీమ్‌లకు మూడేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో పాక్ బౌలర్ల ధాటికి ఒమన్ బ్యాటర్లు తేలిపోయారు. దీంతో ఆ జట్టు 16.4 ఓవర్లలో 67 పరుగులే చేసి చిత్తుగా ఓడింది. 10 పరుగుల వ్యవధిలోనే ఏడు వికెట్లు కోల్పోవడం గమనార్హం. హమ్మద్ మీర్జా (27) ఒక్కడే కాస్త పోరాడాడు. స్పిన్నర్లు సుఫియాన్, సయీమ్ అయూబ్‌లతో పాటు పేసర్ ఫహీమ్‌లకు రెండేసి వికెట్లు లభించాయి.

సంక్షిప్త స్కోర్లు

పాకిస్థాన్: 20 ఓవర్లలో 160/7 (మహ్మద్ హరీస్ 66, ఫర్హాన్ 29, ఫఖర్ 23; కలీమ్ 3/31, ఫైజల్ 3/34).

ఒమన్: 16.4 ఓవర్లలో 67 ఆలౌట్. (హమ్మద్ 27; ఫహీమ్ 2/6, సుఫియాన్ 2/7, సయీమ్ అయూబ్ 2/8).

సెమీస్‌లో సాత్విక్ జోడీ

● లక్ష్యసేన్ కూడా..

● హాంకాంగ్ ఓపెన్



హాంకాంగ్: భారత షట్లర్లు లక్ష్యసేన్, సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ షెట్టి హాంకాంగ్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో టైటిల్ దిశగా దూసుకెళ్తున్నారు. సింగిల్స్‌లో లక్ష్యసేన్, డబుల్స్‌లో సాత్విక్ ద్వయం సెమీఫైనల్లో ప్రవేశించారు. ఇద్దరు భారత ఆటగాళ్ల మధ్య జరిగిన సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో లక్ష్య 21-16, 17-21, 21-13తో ఆయుష్ షెట్టిపై గెలుపొందాడు. గత మ్యాచ్‌లో 2024 ప్రపంచ చాంపియన్‌షిప్ రన్నరప్ కొడాయి నరౌకాకి షాకిచ్చి సంచలనం సృష్టించిన ఆయుష్.. లక్ష్యతో పోరులో మాత్రం తడబడ్డాడు. అయితే ఓడినా.. ఆయుష్ గెలుపు కోసం చివరిదాకా పోరాడిన తీరు ఆకట్టుకుంది. గంటా ఆరు నిమిషాల పాటు సాగిన హోరాహోరీ పోరులో తొలి గేమ్ ఓడినా, రెండో గేమ్‌లో లక్ష్యపై పైచేయి సాధించి మ్యాచ్ గెలిచేలా కనిపించాడు. కానీ, నిర్ణాయక మూడో గేమ్ ఆఖర్లో పలుమార్లు ఔట్ షాట్‌లు కొట్టి మ్యాచ్‌ను చేజార్చుకున్నాడు. ఫైనల్ బెర్త్ కోసం తైవాన్ షట్లర్, మూడో సీడ్ చో తిన్ చెన్‌తో లక్ష్య అమీతుమీ తేల్చుకోనున్నాడు. పురుషుల డబుల్స్ క్వార్టర్‌ఫైనల్స్‌లో 8వ సీడ్ సాత్విక్/చిరాగ్ జంట 21-14, 20-22, 21-16తో మలేసియా జోడీ ఆరిఫ్ జునైది/రాయ్ కింగ్ యాప్‌ను ఓడించింది. ఇటీవలే ప్రపంచ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకంతో సత్తా చాటిన సాత్విక్ ద్వయం సెమీఫైనల్లో తైవాన్ జోడీ చెన్ చెంగ్ కాన్/లిన్ బింగ్ వీతో తలపడనుంది.

గాథ పోరు ముగిసె..

● నెంబర్‌వన్ చేతిలో ఓటమి

● ఆర్చరీ ప్రపంచ చాంపియన్‌షిప్స్

గ్వాంగ్జు (దక్షిణ కొరియా): ఆర్చరీ ప్రపంచ చాంపియన్‌షిప్స్ రికర్వ్ విభాగంలో భారత్‌కు ఈసారీ నిరాశ తప్పలేదు. మహిళల రికర్వ్ వ్యక్తిగత విభాగంలో ప్రీక్వార్టర్స్ చేరి టైటిల్‌పై ఆశలు రేపిన 15 ఏళ్ల గాథ ఖడాకే పోరాటం ముగిసింది. ప్రపంచ నెంబర్‌వన్, పారిస్ ఒలింపిక్స్‌లో మూడు స్వర్ణాల విజేత లిమ్ షియోన్ (కొరియా)తో జరిగిన పోరులో గాథ 0-6తో ఓటమిపాలైంది. ప్రపంచ చాంపియన్‌షిప్స్ రికర్వ్ విభాగంలో భారత్ చివరిసారిగా 2019లో పురుషుల జట్టు రజతం నెగ్గింది. కాగా, ఈసారి టోర్నీలో కాంపౌండ్ ఈవెంట్‌లో పురుషుల జట్టు స్వర్ణం, మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో జ్యోతి సురేఖ/రిషభ్ జోడీ రజతం నెగ్గిన సంగతి తెలిసిందే.

యష్, రజత్ శతకాలు

● సెంట్రల్ జోన్ 384/5 ● 'సౌత్'తో దులీప్ ట్రోఫీ ఫైనల్

బెంగళూరు: దులీప్ ట్రోఫీ ఫైనల్లో సెంట్రల్ జోన్ రెండో రోజే పట్టు బిగించింది. యష్ రాథోడ్ (137 బ్యాటింగ్), కెప్టెన్ రజత్ పటీదార్ (101) శతకాల సహాయంతో.. శుక్రవారం ఆట ముగిసే సమయానికి సెంట్రల్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 384/5 స్కోరు సాధించింది. ప్రస్తుతం జట్టు 235 పరుగుల భారీ ఆధిక్యంలో నిలిచింది. ఓపెనర్ మలేవర్ (53) హాఫ్ సెంచరీ చేయగా, క్రీజులో యష్‌తో పాటు సారాంశ్ (47 బ్యాటింగ్) ఉన్నాడు. లెఫ్టామ్ పేసర్ గుర్జప్‌నీత్‌కు మూడు వికెట్లు దక్కాయి. సౌత్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 149 పరుగులకు కుప్పకూలిన విషయం తెలిసిందే.

బెంగళూరు హ్యాట్రిక్

జైపూర్: ప్రొ. కబడ్డీ లీగ్‌లో బెంగళూరు బుల్స్ జోరు ప్రదర్శిస్తూ వరుసగా మూడో విజయం సాధించింది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో 28-23తో జైపూర్ పింక్ పాంథర్స్‌ను ఓడించింది. దీపక్ శంకర్ మరో 'హై ఫైవ్'తో అదరగొట్టగా, రైడర్ అలీరెజా 8 పాయింట్లతో సత్తా చాటాడు. జైపూర్‌లో నితిన్ కుమార్ (8) ఒక్కడే రాణించాడు. మరో మ్యాచ్‌లో తమిళ్ తలైవాస్ 46-36తో బెంగాల్ వారియర్స్‌ను చిత్తు చేసింది.

ఇక దయచేయండి!



విరుష్కతో కివీస్ హోటల్ సిబ్బంది

న్యూఢిల్లీ: విరాట్ కోహ్లీ, అనుష్క జోడీని వెళ్లిపోవాలని న్యూజిలాండ్‌లోని ఓ హోటల్ సిబ్బంది కోరిన ఉదంతాన్ని టీమిండియా బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్ వెల్లడించింది. గతంలో భారత పురుషులు, మహిళల జట్లు ఒకే సమయంలో కివీస్‌లో పర్యటించాయి. ఇరు జట్లూ ఒకే హోటల్‌లో బస చేశాయి. ఈక్రమంలో బ్యాటింగ్‌కు సంబంధించి సలహాలు ఇవ్వాలని స్మృతి మంధాన, జెమీమా..విరాట్‌ను కోరారు. దాంతో అదే హోటల్‌లోని కేఫ్‌కు రావాలని విరాట్ వారికి సూచించాడు. అప్పటికే కోహ్లీ, అనుష్క జోడీ అక్కడ ఉంది. దాదాపు నాలుగు గంటలపాటు విరాట్, మంధాన, జెమీమాతోపాటు అనుష్క మాట్లాడుకున్నారట. తొలి అరగంట క్రికెట్ విషయాలపై చర్చించగా.. ఆపై సాధారణ జీవితానికి సంబంధించిన మాటల్లోకి జారుకున్నట్టు జెమీమా వెల్లడించింది. అప్పటికే రాత్రి 11.30 కావడంతో కేఫ్ సిబ్బంది వచ్చి విరాట్, అనుష్కను అక్కడ నుంచి వెళ్లిపోవాలని సూచించినట్టు రోడ్రిగ్స్ ఓ ఇంటర్వ్యూలో వెల్లడించింది.

ఐపీఓ మార్కెట్లో సంస్కరణలు

● కనీస పబ్లిక్ షేర్ హోల్డింగ్‌పై కంపెనీలకు ఊరట

● 10 ఏళ్ల వరకు గడువు పెంపు

● సెబీ చైర్మన్ పాండే



ముంబై : దేశ క్యాపిటల్ మార్కెట్లో మరిన్ని సంస్కరణలకు మార్కెట్ నియంత్రణ మండలి సెబీ శ్రీకారం చుట్టింది. శుక్రవారం చైర్మన్ తుహిన్ కాంత పాండే అధ్యక్షతన జరిగిన బోర్డు సమావేశంలో సెబీ దీనికి సంబంధించి పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇందులో భాగంగా పెద్దమొత్తంలో మార్కెట్ క్యాపిటలైజేషన్ ఉన్న కంపెనీలకు పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)ల జారీలో మరింత వెసులుబాటు కల్పించాలని సెబీ నిర్ణయించింది. రూ.50,000 కోట్ల నుంచి రూ.లక్ష కోట్ల మార్కెట్ క్యాపిటలైజేషన్ ఉన్న కంపెనీలు తమ ఈక్విటీలో 25 శాతం కనీస పబ్లిక్ షేర్‌హోల్డింగ్ (ఎంపీఎస్) కలిగి ఉండాలన్న గడువును ప్రస్తుత మూడేళ్ల నుంచి ఐదేళ్లకు పొడిగించారు. కంపెనీలు ఈ మొత్తాన్ని ఒకేసారి కాకుండా ముందు కనీసం 8 శాతం ఈక్విటీ షేర్లను జారీ చేసి, ఆ తర్వాత మిగతా 17 శాతం ఈక్విటీ షేర్లను దశలవారీగా ఐపీఓల ద్వారా విక్రయించేందుకు అనుమతిస్తారు. రూ.లక్ష కోట్ల నుంచి రూ.5 లక్షల కోట్ల మార్కెట్ క్యాప్ ఉన్న కంపెనీలు ఐదేళ్లలో జారీ చేయాల్సిన ఎంపీఎస్ ఈక్విటీ షేర్ల పరిమితినీ సెబీ సవరించింది. ప్రస్తుతం ఈ కంపెనీలు ఇందుకోసం ముందుగా 5 శాతం ఈక్విటీని ఎంపీఎస్‌గా జారీ చేయాలి. దీన్ని 2.75 శాతానికి కుదించాలని సెబీ నిర్ణయించింది. ఇక రూ.5 లక్షల కోట్ల కంటే ఎక్కువ మార్కెట్ క్యాప్ ఉన్న కంపెనీలు 25 శాతం ఎంపీఎస్‌కి చేరాల్సిన గడువునీ ప్రస్తుత ఐదేళ్ల నుంచి పదేళ్లకు పెంచారు. ఇందుకోసం ఈ కంపెనీలు ముందు తమ ఈక్విటీలో 2.5 శాతం షేర్లను ఐపీఓ ద్వారా జారీ చేస్తే సరిపోతుంది. మిగతా 22.5 శాతం ఈక్విటీ షేర్లను మార్కెట్ పరిస్థితులను బట్టి పదేళ్లలో జారీ చేస్తే సరిపోతుంది.

పెద్ద కంపెనీలకు ఊరట: సెబీ తాజా నిర్ణయం త్వరలో పబ్లిక్ ఇష్యూకి వచ్చే రిలయన్స్ జియో, ఎన్ఎస్ఈలకు మేలు చేస్తుందని భావిస్తున్నారు. సెబీ నిబంధనలకు అనుగుణంగా ఒకేసారి పెద్ద మొత్తంలో ఐపీఓలు జారీ చేస్తే.. ఆ ఇష్యూలను భరించే శక్తి మార్కెట్‌కు లేకపోవడంతో పాటు సెకండరీ మార్కెట్ కూడా తీవ్ర ఆటుపోట్లకు లోనవుతోంది. నిర్దిష్ట గడువులోనే దశల వారీగా ఈ వాటా విక్రయించేందుకు అనుమతించాలని కంపెనీలు ఎప్పటి నుంచో కోరుతున్నాయి. సెబీ ఎట్టకేలకు శుక్రవారం దీనికి ఆమోదం తెలిపింది.

రిటైల్ మదుపరులకు ఊరట: ప్రస్తుతం రూ.5,000 కోట్లకు మించిన ఐపీఓ ఇష్యూల్లో రూ.2 లక్షల లోపు పెట్టుబడితో దరఖాస్తు చేసే రిటైల్ మదుపరులకు 35 శాతం షేర్లు కేటాయిస్తున్నారు. దీన్ని 25 శాతానికి కుదించాలని సంస్థాగత మదుపరుల నుంచి ఒత్తిడి వచ్చింది. అయినా ఈ వాటాను యథాతథంగా 35 శాతం వద్దే కొనసాగించాలని నిర్ణయించినట్టు సెబీ చైర్మన్ పాండే చెప్పారు. క్వాలిఫైడ్ ఇనిస్టిట్యూషనల్ బయ్యర్స్ (క్యూఐబీ)కు కేటాయించే 50 శాతం వాటానూ అలాగే కొనసాగించాలని సెబీ నిర్ణయించింది.

ఎఫ్‌పీఐల పెట్టుబడులకు సింగిల్ విండో: భారత స్టాక్ మార్కెట్లో పెట్టుబడులు పెట్టే విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్ల (ఎఫ్‌పీఐ)కు సింగిల్ విండో విధానాన్ని ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. దీని ద్వారా తక్కువ రిస్క్ కలిగిన ఎఫ్‌పీఐల పెట్టుబడులను ఆకర్షించవచ్చని భావిస్తోంది. ఇందుకోసం ప్రత్యేకంగా సింగిల్ విండో ఆటోమేటిక్ అండ్ జనరలైజ్డ్ యాక్సెస్ ఫర్ ట్రస్టెడ్ ఫారిన్ ఇన్వెస్టర్స్ (స్వాగత్-ఎఫ్ఐ) పేరుతో కొత్త ముసాయిదాను రూపొందించింది. కాగా దేశంలో ప్రతి నెలా 100 ఎఫ్‌పీఐలు నమోదవుతూ వస్తున్నాయని సెబీ తెలిపింది. ఏడాది క్రితం 10,500 ఎఫ్‌పీఐలు నమోదై ఉండగా ప్రస్తుతం ఈ సంఖ్య 12,000 దాటిందని పేర్కొంది.

ఇతర ప్రధాన నిర్ణయాలు

● రూ.250 కోట్లకు మించిన ఐపీఓల్లో యాంకర్ ఇన్వెస్టర్ల వాటా 10% నుంచి 15 శాతానికి పెంపు

● రూ.250 కోట్ల కంటే తక్కువ ఉండే ఐపీఓల్లో మదుపు చేసే యాంకర్ ఇన్వెస్టర్ల సంఖ్య 5 నుంచి 15 మధ్య ఉండాలి

● నియమిత మదుపరులకు సేవలు అందించే ఏఐఎఫ్‌లకు ఊరట

● రీట్స్, ఇన్విట్స్.. ఈక్విటీ పెట్టుబడులుగా వర్గీకరణ

● ప్రతి స్టాక్ ఎక్స్ఛేంజీలో ఇద్దరు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ల నియామకం

అపోలో హాస్పిటల్స్ చేతికి అపోలో హెల్త్

బిజినెస్

● ఐఎఫ్‌సీ నుంచి 31 శాతం వాటా కొనుగోలు

● డీల్ విలువ రూ.1,254 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అపోలో హెల్త్ అండ్ లైఫ్‌స్టైల్ లిమిటెడ్ (ఏహెచ్ఎల్ఎల్) పూర్తి స్థాయిలో అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ (ఏహెచ్ఈఎల్) అనుబంధ సంస్థ కానుంది. ఇందుకోసం ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఎఫ్‌సీ) చేతిలో ఉన్న 31 శాతం వాటాను ఏహెచ్ఈఎల్ రూ.1,254.07 కోట్లకు కొనుగోలు చేయనుంది. శుక్రవారం జరిగిన సమావేశంలో ఏహెచ్ఈఎల్ డైరెక్టర్ల బోర్డు ఈ షేర్ల కొనుగోలు ఒప్పందానికి ఆమోదం తెలిపింది. దీంతో ఏహెచ్ఎల్ఎల్ ఈక్విటీలో ఏహెచ్ఈఎల్ వాటా 99.42 శాతానికి చేరుతుంది. మిగతా 0.58 శాతం షేర్లు ఈ-సాప్స్ కింద ఉద్యోగుల వద్ద ఉంటాయి. ఏహెచ్ఎల్ఎల్ కార్యకాపాలపై పూర్తి నియంత్రణ, యాజమాన్యం కోసం ఐఎఫ్‌సీ నుంచి ఈ వాటాలను కొనుగోలు చేస్తున్నట్టు ఏహెచ్ఈఎల్ రెగ్యులేటరీ సంస్థలకు తెలిపింది. దీనివల్ల ఏహెచ్ఎల్ఎల్ నిర్వహణ సామర్థ్యం మరింత మెరుగుపడడంతో పాటు, ఆ సంస్థ వ్యాధి నిర్ధారణ సేవలను ఏహెచ్ఈఎల్‌తో పూర్తి స్థాయిలో అనుసంధానించేందుకు వీలవుతుందని పేర్కొంది. ఈ చర్య అపోలో గ్రూప్ సమగ్ర ఆరోగ్య సేవలకు మరింత విలువ జోడిస్తుందని అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజెస్ ఎండీ సునీతా రెడ్డి తెలిపారు. ఏహెచ్ఎల్ఎల్‌పై పూర్తి పట్టు ద్వారా ఆ కంపెనీకి చెందిన ప్రాథమిక ఆరోగ్య, వ్యాధి నిర్ధారణ సేవలు, మహిళల ఆరోగ్యం, డెంటల్, డయాలసిస్, అంబులెన్స్ సేవలను మరింత ముందుకు తీసుకు వెళతామని ఏహెచ్ఈఎల్ జాయింట్ ఎండీ సంగీతా రెడ్డి తెలిపారు.

గురుగ్రామ్‌లో క్యాన్సర్ కేర్ సెంటర్: గురుగ్రామ్‌లో రూ.573 కోట్ల పెట్టుబడితో అదనంగా సమగ్ర క్యాన్సర్ కేర్ సెంటర్ ఏర్పాటు చేసేందుకూ ఏహెచ్ఈఎల్ బోర్డు ఆమోదం తెలిపింది. ఈ కేంద్రం ద్వారా ఏటా అదనంగా 350 రోగులకు వైద్య సేవలు అందించవచ్చు. 2029 మార్చి నాటికి ఈ కేంద్రం ఏర్పాటు పూర్తవుతుంది.

మళ్లీ ధరలు సుర్..

ఆగస్టు ద్రవ్యోల్బణం 2.07%

న్యూఢిల్లీ: ద్రవ్యోల్బణం మరోసారి ఊర్ధ్వముఖ చలనం ప్రారంభించింది. కూరగాయలు, మాంసం, చేపలు, గుడ్ల ధరలు పెరగడంతో ఆగస్టు నెలలో రిటైల్ ద్రవ్యోల్బణం 2.07 శాతానికి చేరింది. ద్రవ్యోల్బణం జూలైలో 1.61%, గత ఏడాది ఆగస్టులో (-) 0.69% ఉంది. 9 నెలల పాటు వరుసగా తగ్గుతూ వచ్చిన వినియోగదారుల ధరల సూచీ ఆగస్టులో తొలిసారి ఎగువకు కదిలింది. అయితే ఆర్‌బీఐకి ప్రభుత్వం నిర్దేశించిన కట్టడి పరిధి 4% (2 శాతం ఎగువకు లేదా దిగువకు సద్దుబాటుతో)లోపే ఉంది. ఆగస్టు నెలలో ద్రవ్యోల్బణం గ్రామీణ ప్రాంతాల్లో 1.18% నుంచి 1.69 శాతానికి, పట్టణ ప్రాంతాల్లో 2.1% నుంచి 2.47 శాతానికి పెరిగింది. రాష్ట్రాల వారీగా చూస్తే కేరళలో గరిష్ఠంగా9.04% ఉండగా అసోమ్‌లో కనిష్ఠంగా -0.66% ఉంది. ఆహార, ఇంధన విభాగాలు మినహా ఇతర విభాగాల్లో ద్రవ్యోల్బణం 4.3 శాతంగా ఉంది.

మార్కెట్లలో కొనసాగిన ర్యాలీ

ఇటు ఈక్విటీలు, అటు బులియన్ పరుగులు

ముంబై: అమెరికన్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లు తగ్గిస్తుందన్న ఆశలతో పాటు ఇన్ఫోసిస్ ప్రకటించిన భారీ బైబ్యాక్ ఉత్తేజంతో శుక్రవారం కూడా ఈక్విటీ మార్కెట్లో ర్యాలీ కొనసాగింది. వరుసగా సెన్సెక్స్ ఐదో రోజు, నిఫ్టీ ఎనిమిదో రోజు లాభాల్లో ముగిశాయి. ఇంట్రాడేలో 444.12 పాయింట్లు లాభంతో 81,992.85 పాయింట్లను తాకిన సెన్సెక్స్ చివరికి 355.97 పాయింట్ల లాభంతో 81,904.70 వద్ద ముగిసింది. నిఫ్టీ 108.50 పాయింట్ల లాభంతో 25,114 వద్ద ముగిసింది. వారం మొత్తంలో సెన్సెక్స్ 1193.94 పాయింట్లు, నిఫ్టీ 373 పాయింట్లు లాభపడ్డాయి. వరుసగా 8 సెషన్లలో నిఫ్టీ 534 పాయింట్లు లాభపడింది.

బంగారం, వెండి భగభగ

బులియన్ మార్కెట్లో బంగారం, వెండి ధరల ర్యాలీ కూడా అప్రతిహతంగా కొనసాగుతోంది. ఢిల్లీ మార్కెట్లో 99.9% స్వచ్ఛత గల 10 గ్రాముల బంగారం ధర రూ.700 పెరిగి మరో జీవితకాల గరిష్ఠ స్థాయి రూ.1,13,800 వద్ద ముగిసింది. 99.5% స్వచ్ఛత గల బంగారం ధర సైతం రూ.700 పెరిగి రూ.1,13,300 వద్ద స్థిరపడింది. రెండు రోజుల నష్టాలకు తెర దించిన వెండి ధర బలమైన పునరుజ్జీవం సాధించింది. కిలో వెండి రూ.4,000 పెరిగి జీవితకాల గరిష్ఠ స్థాయి రూ.1,32,000 వద్ద స్థిరపడింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

13వ తేదీ			
హైదరాబాద్	535	విజయవాడ	550
వరంగల్	537	గోదావరి	545
చిత్తూరు	563	విశాఖపట్నం	555
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	121	విజయవాడ	140
వరంగల్	121	గుంటూరు	132
కరీంనగర్	121	ఒంగోలు	132
మహబూబ్‌నగర్	121	చిత్తూరు	118
కర్నూలు	121	నెల్లూరు	123
విశాఖపట్నం	144	అనంతపురం	123
గోదావరి	140		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,11,280 ▲	1,02,000 ▲	1,41,000 ▲
విజయవాడ	1,13,150 ▲	1,07,000 ▲	1,31,800 ▲
విశాఖపట్నం	1,13,040 ▲	1,00,540 ▼	1,42,000 ▲
రాజమండ్రి	1,11,270 ▲	1,02,000 ▲	1,28,300 ▲
ప్రొద్దుటూరు	1,13,200 ▼	1,04,140 ▼	1,31,600 ▲
ముంబై	1,09,707 ▲	1,00,492 ▲	1,28,008 ▲

● ఐటీసీ ఆశీర్వాద్ మసాలా..నేచురల్ స్టార్ నానితో 'దమ్ము మీదే.. స్టార్ మీరే' ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఆంధ్ర, తెలంగాణ వాసుల అభిరుచులకు అనుగుణంగా దమ్దార్ ఫుడ్, సినిమా పేరుతో ఈ క్యాంపెయిన్‌ను మహిళల కోసం ప్రత్యేకంగా రూపొందించింది. ఇందులో భాగంగా వంటల పోటీలో గెలిచిన మహిళలతో నాని సినిమా థియేటర్ ప్రకటనలో కనిపించనున్నారు.

● హెల్త్‌కేర్ టెక్నాలజీ సంస్థ ఫుజిఫిల్మ్ ఇండియా.. నిజామాబాద్‌లో తన అడ్వాన్స్‌డ్ ఏఎంయుఎల్ఈటీ ఇన్నోవాలిటీ ఫుల్ ఫీల్డ్ డిజిటల్ మమ్మోగ్రఫీ (ఎఫ్ఎఫ్‌డీఎం) సిస్టమ్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. విశ్వమ్ డయాగ్నోస్టిక్స్ సెంటర్‌లో ఈ సిస్టమ్‌ను ఏర్పాటు చేసింది. బ్రెస్ట్ క్యాన్సర్ డయాగ్నోసిస్‌లో ఈ మమ్మోగ్రఫీ కీలకంగా ఉండనుంది.

● టాటా ఈవీ.. మార్కెట్లోకి సరికొత్త నెక్సాన్ ఈవీ విడుదల చేసింది. ఏడీఏఎస్ సేఫ్టీ టెక్‌తో దీన్ని తీసుకువచ్చింది. దీంతో పాటు కొన్ని కొత్త ఫీచర్లను పొందుపరిచింది. ఎంపవర్డ్ ప్లస్ ఏ45, ఏ45 డార్క్, ఏ 45 రెడ్ డార్క్ వేరియంట్లలో అందుబాటులో ఉండనున్న ఈ నెక్సాన్ ఈవీ ధరలు వరుసగా రూ.17.29 లక్షలు, రూ.17.49 లక్షలు, రూ.17.49 లక్షలు (ఎక్స్‌షోరూమ్)గా ఉన్నాయి.

హైదరాబాద్ మార్కెట్లోకి విన్‌ఫాస్ట్

వీఎఫ్6, వీఎఫ్7 ఎలక్ట్రిక్ కార్లు విడుదల



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): వియత్నాం కేంద్రంగా ఉన్న విన్‌గ్రూప్ జేఎస్‌సీ ఎలక్ట్రిక్ వాహన సంస్థ విన్‌ఫాస్ట్ ఇండియా.. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మార్కెట్లలోకి అడుగు పెట్టింది. ఇందులో భాగంగా హైదరాబాద్‌లో తొలి షోరూమ్‌ను ప్రారంభించింది. శుక్రవారం నాడిక్కడ కంపెనీ డిప్యూటీ సీఈఓ అరుణోదయ్ దాస్.. గచ్చిబౌలి, బేగంపేటల్లో నానేష్ ఆటోమోటివ్స్ ఏర్పాటు చేసిన షోరూమ్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మార్కెట్లోకి విన్‌ఫాస్ట్ ప్రీమియం ఎలక్ట్రిక్ కార్లు వీఎఫ్6, వీఎఫ్7 విడుదల చేశారు. వినియోగదారుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని 10 ఏళ్ల బ్యాటరీ వారంటీతో ఈ కార్లను తీసుకు వచ్చినట్టు ఆయన చెప్పారు. కాగా, వీఎఫ్6 ప్రారంభ ధర రూ.16.49 లక్షలు, వీఎఫ్7 ప్రారంభ ధర రూ.20.89 (ఎక్స్‌షోరూమ్)గా నిర్ణయించినట్లు దాస్ తెలిపారు. ఈ ఏడాది చివరి నాటికి దేశవ్యాప్తంగా 27కి పైగా నగరాల్లో 35 డీలర్‌షిప్స్, 26 వర్క్‌షాప్స్‌ను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. కాగా హైదరాబాద్ మార్కెట్లో ఇప్పటికే 150కి పైగా కార్లకు బుకింగ్స్ వచ్చాయని, ఈ నెల 22 నుంచి వీటి డెలివరీలను ప్రారంభించనున్నట్లు నానేష్ ఆటో డైరెక్టర్ అక్షయ్ జైన్ తెలిపారు.

మొదటి సంవత్సరం స్పాట్ అడ్మిషన్స్

ఆదిలాబాద్ అర్బన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యా సంవత్సరానికి తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం స్పాట్ ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అరుణకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ పూర్తి చేసి అర్హులైన ఎస్సీ విద్యార్థినులు ఈనెల 15లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పదవ తరగతి, ఇంటర్ మెమో, కుల ఆదాయ ధ్రువీకరణ పత్రం, బోనఫైడ్, ఆధార్‌కార్డు, 5 పాస్‌ఫొటోలు రెండు సెట్ల జిరాక్స్ కాపీలతో కళాశాలలో సంప్రదించాలని కోరారు.



హెల్మెట్లు ధరించి భవనాన్ని పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నేతలు

నూతన కలెక్టరేట్‌ను పూర్తి చేయాలి

● హెల్మెట్లతో బీఆర్ఎస్ వినూత్న నిరసన

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ కార్యాలయ పైఅంతస్తు కూలిపోవడం జిల్లాలో చర్చనీయాంశం కాగా.. బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు ఈ ఘటనపై తీవ్రంగా స్పందించారు. శుక్రవారం ఉదయం కలెక్టర్ కార్యాలయాన్ని తలకు హెల్మెట్లు ధరించి పరిశీలించి వినూత్నంగా నిరసన తెలిపారు. భవనం ఎప్పుడు కూలుతుందో? తెలియని పరిస్థితుల్లో ఉద్యోగులు విధులు నిర్వర్తించడం దురదృష్టకరమని అభిప్రాయపడ్డారు. శిథిలాలను పరిశీలించి త్వరితగతిన నూతన భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు సయ్యద్ సాజిదోద్దీన్ మాట్లాడుతూ.. కలెక్టర్ కార్యాలయ భవనం కూలిన ఘటన సమయంలో మంత్రి ఇక్కడే సమీక్ష జరుపుతున్నా.. కనీసం ఇక్కడి పరిస్థితిని పరిశీలించకుండా వెళ్లిపోయారని అన్నారు. నిజాం కాలం నాటి భవనం శిథిలావస్థకు చేరుకుందన్న విషయాన్ని గ్రహించి గత బీఆర్ఎస్ ప్రభుత్వం నూతన భవన నిర్మాణాన్ని ప్రారంభించిందని పేర్కొన్నారు. భవన నిర్మాణం పూర్తికాకపోవడంతో ఉద్యోగులు భయంభయంగా గడుపుతూ విధులు నిర్వహిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాజిదోద్దీన్, యూనుస్ అక్బాని, ప్రకాష్, అడప తిరుపతి, గంద్రత్ రమేష్, మర్శెట్టి గోవర్ధన్, మెట్టు ప్రహ్లాద్, తదితరులు పాల్గొన్నారు.

● హరీష్‌రావ్‌ను కలిసిన నాయకులు

జైనథ్: మాజీ మంత్రి తన్నీర్ హరీష్‌రావ్‌ను శుక్రవారం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న ఆదివాసీ పర్థాన్ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు దుర్వ నగేష్‌లు హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలోని తన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆదిమ గిరిజన తెగలైన పర్థాన్, తోటి, అంద్, నాయక్‌పోడ్ తెగలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పారెస్టు అధికారుల తీరును మాజీ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మాజీ మంత్రి సానుకూలంగా స్పందించారన్నారు.



హరీష్‌రావ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రామన్న



● జిల్లా కలెక్టరేట్ కార్యాలయం

కలెక్టరేట్ @ 84

- ఎనిమిది దశాబ్దాలకు పైగా కొనసాగుతున్న పాలన
- విధులు నిర్వహించేందుకు వీలు లేక ఉద్యోగులకు సెలవు
- భవన నాణ్యతపై ఇంజనీరింగ్ అధికారులతో ప్రత్యేక కమిటీ
- రెండేళ్లుగా పునాదుల్లోనే కొత్త కలెక్టరేట్ భవన నిర్మాణ పనులు
- కుప్పకూలిన కలెక్టరేట్‌తో జిల్లా పాలనపై ప్రభావం

నిజాం కాలంనాటి అతి పురాతన భవనం



● కుప్పకూలిన కలెక్టరేట్ భవనం

ఎడతెరిపి లేకుండా..

కురుస్తున్న భారీ వర్షాలకు జిల్లా కలెక్టరేట్ భవనం కుప్పకూలడం రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపుతోంది. 1937 నిజాం కాలంలో జిల్లా కలెక్టరేట్ భవన నిర్మాణ పనులను ప్రారంభించారు. 1941లో అప్పటి నిజాం సర్కారు అధికారి వీకే వెల్లోడి చేతుల మీదుగా ప్రారంభించారు. గత పదేళ్లుగా శిథిలావస్థకు చేరుకుంది. దీంతో భవనం పైకప్పు క్రమక్రమంగా పెచ్చులూడడం ప్రారంభమైంది. ఇప్పటికే రెండు, మూడుసార్లు మరమ్మతులు చేసినా.. ప్రయోజనమే లేకుండా పోయింది. 2018లో పూర్తిస్థాయిలో మరమ్మతులను చేసేందుకు గత ప్రభుత్వం రూ.3కోట్ల 5లక్షల నిధులను మంజూరు చేసింది. అయినా ఇప్పటికీ పనులు అసంపూర్తిగానే కనిపిస్తున్నాయి.

ఆదిలాబాద్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టరేట్ భవనం మరమ్మతులకు నిధుల విడుదలలో తీవ్ర జాప్యం జరుగడంతో పనులు పూర్తిగా నిలిచిపోయాయి. గత కొద్ది రోజులుగా ప్రమాదకర పరిస్థితులతోనే పాలనను నెట్టుకొస్తున్నారు. తాజాగా గురువారం రాత్రి ఒక్కసారిగా కుప్పకూలడంతో ఉద్యోగులు భయాందోళనతో పరుగులు తీశారు. బాల్కనీ పైకప్పు కూలిన సమయంలో ఎవరు లేక పోవడంతో పెద్ద ప్రమాదమే తప్పింది.ముందే మరమ్మతులు చేపట్టి ఉంటే ఇలాంటి పరిస్థితులు ఎదురయ్యేవి కాదన్న వాదనలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ నిర్లక్ష్యంతో పాటు అధికారుల అలసత్వం స్పష్టంగా కనిపిస్తుంది.

1956 నుంచి కలెక్టర్‌ల పాలన

నిజాం ప్రభుత్వ హయాంలో ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంగా సర్కార్-ఇ- అమీన్‌ల ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా పాలన కొనసాగింది. 1941 నుంచి 1956 వరకు నిజాం ప్రభుత్వం నియమించిన ప్రత్యేక అధికారులే పరిపాలించారు. ఆ తర్వాత 1956 నవంబరు 1న భాషా ప్రతిపాదికన ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 1956 నుంచి జిల్లాలో కలెక్టర్‌ల పాలన ప్రారంభమైంది. తొలి జిల్లా కలెక్టర్‌గా బీఎఫ్ దిత్యా ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఆయన అనంతరం ఇప్పటి వరకు 53 మంది కలెక్టర్‌లు ఈ కలెక్టరేట్ భవనం నుంచే పాలన కొనసాగించారు. 84ఏళ్ల తర్వాత భవన నిర్మాణ కట్టడాలు కూలడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తున్నాయి.

8 విభాల్లోకి వెళ్లలేని పరిస్థితి

జిల్లా కలెక్టరేట్ భవనం బాల్కనీ రూఫ్ స్లాబ్ కుప్పకూలడంతో 8 విభాగాల్లోకి వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. విభాగం ఏ నుంచి విభాగం హెడ్ వరకు పూర్తిగా రూఫ్ లెవల్

(తరువాయి 4వ పేజీలో....)

ఉద్యోగుల్లో మొదలైన భయాందోళన

కుప్పకూలిన కలెక్టరేట్ భవనానికి మరమ్మతులు చేసి మళ్లీ అందుబాటులోకి తీసుకొచ్చిన ఉద్యోగుల్లో భయాందోళన కనిపిస్తుంది. కూలీన విభాగాలతో పాటు మిగితా విభాగాల్లో కూడా కట్టడాలు పగుళ్లు తేలి పెచ్చులూడి కనిపిస్తున్నాయి. ఎప్పుడు ఏం జరుగుతుందో? తెలియని పరిస్థితి కనిపిస్తుంది. నిపుణుల కమిటీ మరమ్మతులు చేసేందుకు అనుమతించినా ప్రయోజనం లేదంటున్నారు. దీంతో ప్రత్యామ్నాయంగా జడ్పీ కార్యాలయంతో పాటు పాత మున్సిపల్ కార్యాలయ భవనానికి కలెక్టరేట్ కార్యాలయాన్ని మార్చే యోచనలో అధికారులు ఉన్నట్లు తెలుస్తుంది. అయితే ఏదైనా నిపుణుల కమిటీ రిపోర్టు ఆధారంగానే నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. అన్ని విభాగాలను ఒకే చోట కాకుండా అవకాశం ఉన్నచోటుకి తరలించాలన్న ఉద్దేశ్యంతో ఉన్నట్లు తెలుస్తుంది. మొత్తానికి కలెక్టరేట్ భవనం కుప్పకూలడంతో జిల్లా పాలనపై ప్రభావం పడుతుంది.



నిర్మాణదశలో ఉన్న కొత్త కలెక్టరేట్ కార్యాలయం

ఉప ఆరోగ్య కేంద్రం ఆకస్మిక తనిఖీ

ఇంద్రవెల్లి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్నూర్ గ్రామంలోని ప్రాథమిక ఉప ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి రాథోడ్ నరేందర్ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఆరోగ్య ఉప కేంద్రంలోని వ్యాక్సిన్ నిల్వలు, పలు రికార్డులను ఆయన తనిఖీ చేశారు. ఆసుపత్రి పరిధిలో గర్భిణుల వివరాల నమోదు, తదితర విషయాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవటంతో పాటు సిబ్బంది కూడా తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్యసిబ్బంది దీర్ఘకాలిక పేషంట్లకు పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేయాలని సూచనలు చేశారు. హెల్త్ సూపర్ వైజర్ పవార్ సురేష్, ఏఎన్ఎం పద్మ, సముద్ర, తదితరులు పాల్గొన్నారు.

పొగాకు రహిత సమాజాన్ని నిర్మించాలి

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ పొగాకు రహిత సమాజాన్ని నిర్మించడానికి కృషి చేయాలని జిల్లా పొగాకు నియంత్రణ విభాగం క్లినికల్ సైకాలజిస్ట్ శ్రీకాంత్ అన్నారు. పొగాకు రహిత విద్యా సంస్థల ఏర్పాటులో భాగంగా శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్న త పాఠశాల, బాలక్ మందిర్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... యువత పొగాకు ఉత్పత్తులకు ఎక్కువగా అలవాటు పడుతున్నారని తెలిపారు. పొగాకు ఉత్పత్తుల వాడకం వలన కలిగే అనర్థాలపై యువత అవగాహన కలిగి ఉండాలని సూచించారు. పొగాకు ఉత్పత్తులకు అలవాటు పడిన వారు 14416 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి ఉచిత కౌన్సెలింగ్ సహాయం పొందవచ్చని తెలిపారు. హెచ్ఎం యాకుబ్ అలీ, ఉపాధ్యాయులు, సోషల్‌వర్కర్ చిరంజీవి, తదితరులున్నారు.

సేంద్రియ పద్ధతులపై అవగాహన

ఇచ్చోడ, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో రైతులు ఆర్థిక పురోగతి సాధించాలని, రైతులు సేంద్రియ వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించినట్లు రైతుబిడ్డ ఉత్పత్తి దారుల కంపెనీ సొసైటి డైరెక్టర్ మురళి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో రైతులకు అవగాహన కల్పించారు. గత నాలుగేళ్ల నుంచి సొసైటీ ద్వారా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు పురుగుల మందుల వ్యాపారం చేస్తూ రైతులకు ఆధునిక వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్నారన్నారు.

'స్థానిక సంస్థల ఎన్నికలు వద్దు'

ఉట్నూర్, సెప్టెంబర్(ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు తీర్పు లంబాడీలపై వచ్చేవరకు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించవద్దని, ఒకవేళ నిర్వహించాలని భావిస్తే ఆదివాసీలు బహిష్కరించడం జరుగుతుందని రాజ్ గోండ్ సేవా సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంగం విషంరావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రాజ్ గోండు సేవ సమితి భవనంలో నిర్వహించిన సమితి ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సుప్రీం కోర్టు లంబాడీలపై తీర్పు వచ్చేవరకు లోకల్ బాడీ ఎలక్షన్స్ నోటిఫికేషన్ ప్రభుత్వం వేయకూడదని వారు స్పష్టం చేశారు.

నాల్గవ తరగతి ఉద్యోగుల కార్యవర్గం

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లునావత్ దాస్య తెలిపారు. పట్టణంలో శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎస్.నర్సింగ్‌తో పాటు మిగిలిన సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆయన వెల్లడించారు. సంఘం మాజీ అధ్యక్షుడిపై అవినీతి ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఆయన గతేడాది పదవికి రాజీనామా చేశారని, అయినప్పటికీ.. నూతన కార్యవర్గాన్ని బెదిరిస్తూ సంఘం విచ్ఛిన్నానికి పాల్పడుతున్నారని ఆయన ఈ సందర్భంగా ఆరోపించారు.

గంజాయిని కనుమరుగు చేస్తాం

- తోషం శివారులో పత్తిలో గంజాయి సాగు చేస్తున్న తండ్రీ, ఇద్దరు కొడుకులు
- ఒకరి అరెస్టు.. ఇద్దరి పరారీ
- 627 గంజాయి మొక్కల పట్టివేత
- ఎస్పీ అఖిల్ మహాజన్ వెల్లడి



గుడిహత్నూర్ పోలీస్ స్టేషన్‌లో వివరాలు సేకరిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

గుడిహత్నూర్ రూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గంజాయిని పూర్తిగా రూపుమాపే దిశగా జిల్లా పోలీస్ యంత్రాంగం అహర్నిశలు కష్టపడుతోందని, జిల్లాలో గంజాయి పండించే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తూ చట్టప్రకారం చర్యలు తీసుకుంటుందని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. ఇటీవల మండలంలో పట్టుకున్న గంజాయి మొక్కలు పోలీసులు పట్టుకోగా శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. మండలంలోని తోషం గ్రామానికి చెందిన మర్సకోల దేవురావ్, ఆయన ఇద్దరు కుమారులు మర్సకోల జగన్, మర్సకోల నగేష్ గ్రామ శివారు ప్రాంతంలో ఉన్న పత్తి చేనులో గంజాయి సాగు చేస్తున్నారు. ఈ మేరకు గురువారం సీసీఎస్, ఇచ్చోడ సర్కిల్ పోలీసులు సంయుక్తంగా దాడి చేయగా 627 గంజాయి మొక్కలు లభించాయన్నారు. వారిలో ఒకరిని అరెస్టు చేయగా మిగతా ఇద్దరు పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలని అత్యాశతో గంజాయి పండిస్తున్నారని, వీరిపై గంజాయి చట్టం ఎన్‌డీపీఎస్ ప్రకారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో రెండు కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. గంజాయి మొక్కల పెంపకం చేస్తున్న వారిపట్ల జిల్లా పోలీస్ యంత్రాంగం కఠినంగా వ్యవహరిస్తుందని తెలిపారు. వీరికి ప్రభుత్వ పథకాలు రాకుండా సిఫార్సు చేయడం జరుగుతుందన్నారు. ఇందులో మొదటి నిందితుడు దేవురావ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని, మిగతా ఇద్దరిని త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు. గంజాయితో యువత భవిష్యత్తును, జీవితాలను నాశనం చేస్తుందని, గంజాయి వల్ల కలుగు అనర్థాలు ఎన్నో ఉన్నాయని, అందుకే వ్యాపారం చేయడం, రవాణా చేయడం, పండించడం లాంటివి చేయకూడదని, ఉల్లంఘించిన వారిపై కఠినంగా వ్యవహరించడం జరుగుతుందని హెచ్చరించారు. పట్టుకున్న గంజాయి మొక్కల విలువ బహిరంగ మార్కెట్లో రూ.62 లక్షల 70 వేల వరకు ఉంటుందని తెలిపారు. గంజాయిపై ఎలాంటి సమాచారం ఉన్నా.. ఫోన్ నెం. 8712659973 వాట్సాప్ ద్వారా సమాచారం అందించవచ్చని సమాచారం. వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. ఇప్పటి వరకు ఈయేడు జిల్లాలో 120 గంజాయి కేసులు నమోదు కాగా.. అందులో 40 కిలోల వరకు ఎండు గంజాయి, 600 గంజాయి మొక్కలు స్వాధీనం చేసుకున్నట్లు.. ఈ కేసులలో 240 మంది వరకు నిందితులపై కేసులు నమోదు చేసి అరెస్టు చేశామని తెలిపారు. ఇందులో ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ సింగ్, సిసిఎస్ ఇన్స్‌పెక్టర్ పి.చంద్రశేఖర్, ఇచ్చోడా సీఐ బండారి రాజు, ఎస్ఐ శ్రీకాంత్, సిసిఎస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ చేసిన ఎస్పీ

గుడిహత్నూర్ రూరల్: గుడిహత్నూర్ పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం ఎస్పీ అఖిల్ మహాజన్ తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ రికార్డులను పరిశీలించారు. రికార్డులను ఎప్పటికప్పుడు సమీకరిస్తూ ఎలాంటి పెండెన్సీ లేకుండా చూడాలని తెలిపారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల మర్యాదగా వ్యవహరిస్తూ ప్రజల సమస్యలను శాశ్వతంగా పరిష్కరించే దిశగా కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. పోలీస్ స్టేషన్‌లో ఫైవ్ యస్ విధానాన్ని అమలు చేసి రికార్డుల నిర్వహణ చేయాలన్నారు. రేపటి లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకునేలా కక్షిదారులకు సమాచారం అందించాలని అన్నారు.

గంజాయి సాగు చేస్తే చట్టపరమైన చర్యలు



నిందితుడిని అరెస్ట్ చేసిన సీఐ ప్రభాకర్

నార్నూర్ రూరల్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): గంజాయి సాగు చేస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటాం నార్నూర్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ పి.ప్రభాకర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని సర్కిల్ పోలీస్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ గాదిగూడ మండలం పర్సువాడ(కే) పంచాయతీ పరిధిలోని సారుగూడ గ్రామానికి చెందిన మర్సుకోల జంగు వ్యవసాయ పొలంలో గంజాయి సాగు చేస్తున్నట్లు పక్కా సమాచారం అందిన మేరకు పోలీసుల ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి 16 గంజాయి మొక్కలు స్వాధీనం చేసుకున్నామన్నారు. గంజాయి మొక్కల విలువ రూ.లక్ష 60 వేలు ఉంటుందన్నారు. జంగును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని పేర్కొన్నారు. వారి వెంట ఎస్సైలు పి.ప్రణయ్, కె.అఖిల్, గాదిగూడ పోలీస్ సిబ్బంది ఉన్నారు.

అధికారులకు తలనొప్పిగా ఇళ్ల నిర్మాణం!!

బోథ్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం మండలంలో అధికారులకు తలనొప్పిగా మారింది. ఇల్లు మంజూరైన 45 రోజులలోపు నిర్మాణం చేపట్టాల్సి ఉంది. అయితే లబ్ధిదారులు డబ్బుల్లేక ఇళ్ల ప్రారంభించడం లేదు. జిల్లా అధికారులు మాత్రం ఇళ్ల నిర్మాణం ప్రారంభమయ్యే విధంగా చూడాలని మండలస్థాయి అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. దీంతో స్థానిక అధికారులు సతమతమవుతున్నారు. సోనాల మండల కేంద్రంలో 46 మంజూరుగా.. 28 మంది మాత్రమే ఇళ్లను నిర్మించుకుంటున్నారు. దీనిపై పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని అధికారులపై ఒత్తిడి తీసుకువస్తున్నారు.

కాగా, ఇళ్ల నిర్మాణానికి డబ్బులు లేని నిరుపేదలకు డ్వాక్రా సంఘాల ద్వారా రూ.లక్ష ఇప్పిస్తామని మంత్రి జూపల్లి పేర్కొన్నారు. అయితే లబ్ధిదారులు కొంత మంది డ్వాక్రా సంఘాల్లో లేకపోగా.. ఉన్న కొందరు డిఫాల్టర్లుగా ఉండడంతో సంఘాల వారు ఒప్పుకోవడం లేదు. దీంతో ఇందిరమ్మ నిర్మాణం ప్రారంభమవుతుందా? లేదా? అంటూ కిందిస్థాయి సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



సమస్యలను వింటున్న కలెక్టర్ రాజర్షి షా

సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

● సీఎం పైలట్ ప్రజావాణిలో వినతులు స్వీకరించిన కలెక్టర్

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సీఎం పైలెట్ ప్రజావాణి జిల్లాస్థాయి కార్యక్రమంలో వివిధ శాఖలకు సంబంధించిన అప్పీల్ దరఖాస్తులను కలెక్టర్ రాజర్షి షా స్వయంగా పరిశీలించారు. మండల స్థాయిలో పరిష్కారం కాని దరఖాస్తులకు జిల్లాస్థాయిలో పైలెట్ ప్రజావాణి నిర్వహించారు. ఇందులో నార్నూర్, ఉట్నూర్, జైనథ్, ఆదిలాబాద్ రూరల్‌కు సంబంధించిన 38 మంది అర్జీదారులు తమ అర్జీలతో సమస్యల పరిష్కారానికి కలెక్టర్‌కు విన్నవించారు. ఆయా శాఖలకు, రెవెన్యూకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించిన కలెక్టర్.. నిర్దిష్ట కాలపరిమితి లోపల పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దరఖాస్తుదారులతో నేరుగా మాట్లాడి వివరాలు సేకరించారు ట్రైనీ కలెక్టర్ సలోని, సీఈవో జితేందర్ రెడ్డి, డీఆర్‌డీవో రవీందర్, సంబంధిత అధికారులు, అర్జీదారులు, తదితరులు పాల్గొన్నారు.

● ఆదివాసీ సంస్కృతీ పరిరక్షణకు కృషి చేయాలి

ఆదిలాబాద్ టౌన్: ఆదివాసీ సంస్కృతీ, సంప్రదాయాలు గొప్పవని, వాటి పరిరక్షణకు కృషి చేయాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం ప్రత్యేక సంచికను ట్రైనీ కలెక్టర్ సలోని చబ్ర, సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్, ఇతర నేతలతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలను బాహ్య ప్రపంచానికి తెలిసేలా, ఆదివాసీలను చైతన్యం చేసేలా వ్యాసాలను ప్రత్యేక సంచిక తీసుకువచ్చిన సంఘం నాయకత్వానికి అభినందనలు తెలిపారు. ఇందులో జిల్లా అధ్యక్షుడు ఉయిక విష్ణు, ఉపాధ్యక్షుడు మడావి నాగోరావ్, ఆత్రం తనుష్, కొట్నాక్ సక్కు, ఆత్రం కిష్టన్న, నాయకులు కుమ్రం భీంరావు, మాణిక్ రావు, రామచందర్ పాల్గొన్నారు.

పంచాయతీ అధికారుల నియామకం

తాంసి రూరల్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలానికి నలుగురు జీపీవోలు(పంచాయతీ ఆఫీసర్లు) నియమితులయ్యారు. శుక్రవారం నియమితులైన జీపీవోలు బాధ్యతలను స్వీకరించారు. క్లస్టర్ల వారిగా వారికి నియామక పత్రాలను తహసీల్దార్ అందజేశారు. గిరిగావ్, అంబుగావ్ గ్రామ పంచాయతీలకు భాగ్యలక్ష్మిని నియమించగా, కప్పర్ల క్లస్టర్‌కు సువర్ణ బాధ్యతలను తీసుకున్నారు. హసనాపూర్, వడ్డాది, పొన్నారి పంచాయతీలకు సలీం, అలాగే బండల్నాగాపూర్, సవర్గావ్, గొట్కూరి గ్రామాలకు జాహ్నవిని నియమించారు. తాంసి, జామిడి, పాలోడి గ్రామాలకు సంబంధించిన పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ మేరకు నియమితులైన వారు బాధ్యతలను తీసుకున్నారు.

భారీ వర్షం.. స్తంభించిన రాకపోకలు

- తరోడ బ్రిడ్జి పైనుంచి వాహన రాకపోకల నిలిపివేత
- ఇతర మార్గాలలో దారి మళ్లింపు

జైనథ్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): జైనథ్ ఉమ్మడి మండలంలోని సాత్నాల, బోరజ్, జైనథ్ పరిధిలోని ఆయా గ్రామాలలో శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు భారీ వర్షం కురిసింది. దీంతో మండలంలోని తరోడ(బి), కామాయి, గిమ్మవాగు బ్రిడ్జి పైనుంచి వరద ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. తరోడ బ్రిడ్జిపై నుంచి వాహనాలను పోలీసులు నిలిపి వేయడంతో మండలంలోని నిరాల ఆడ, లాండసాంగ్వి మీదుగా జిల్లాకేంద్రంకు వాహనాలను బస్సులను తరలించారు. జైనథ్ సరిహద్దున గల పెన్‌గంగా నది ఉధృతంగా ప్రవహిస్తుంది. సాత్నాల ప్రాజెక్టులో భారీగా వరద చేరడంతో ప్రాజెక్టు అధికారులు గేట్లను ఎత్తివేతకు సిద్ధమవుతున్నారు. కాగా, గ్రామాలలో గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు రైతులు వేసిన సోయా పత్తి, కంది, జొన్న పంటలకు పూర్తిగా నష్టం వాటిల్లే ప్రమాదం పొంచి ఉందని మండల రైతులు ఆందోళన చెందుతున్నారు.

● సాత్నాల ప్రాజెక్టు రెండు గేట్ల ఎత్తివేత

జైనథ్: మండలంలోని మధ్యతరహా ప్రాజెక్టు సాత్నాల ప్రాజెక్టులో శుక్రవారం భారీ వర్షానికి భారీగా వరదనీరు రావడంతో ప్రాజెక్టు గల నాలుగు గేట్లలో రెండింటిని శుక్రవారం సాయంత్రం అధికారులు ఎత్తివేశారు. ప్రాజెక్టు గరిష్ఠ నీటిమట్టం 286.50 ఎంఎం కాగా కనిష్ఠ నీటి మట్టం 286.40 ఎంసీకు వరద చేరింది. ప్రాజెక్టు నీటి సామర్థ్యం 1.24 టీఎంసీలుగా, 1.046 టీఎంసీలకు వరద చేరింది. ప్రాజెక్టు ఇన్‌ఫ్లో 2100 క్యూసెక్కులుగా కాగా ఔట్ ఫ్లో 2380 క్యూసెక్కులుగా ఉందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు.



తర్నం బ్రిడ్జి పైనుంచి పారుతున్న వరద నీరు



కామాయి లోలెవల్ బ్రిడ్జి పైనుంచి పారుతున్న వరద